

వాట్సాప్ ద్వారా ఇంటర్ హాల్‌టికెట్లు

- పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ పంపించే ఏర్పాట్లు
- హాజరు తక్కువైన విద్యార్థులకు ఫైన్ రద్దు
- సేవలను సులభతరం చేసిన ఇంటర్ బోర్డు



... వార్త 8వ పేజీలో

జానకిరాంపురం సొసైటీలో భారీ అక్రమాలు



జానకిరాంపురంలో సొసైటీ కార్యాలయం

రూ.2 కోట్ల మేర నిధులు దుర్వినియోగం చేసిన సీఈవో

- బినామీ పేర్లతో 200 మందికి రుణాలు
- భూమి లేకపోయినా ఉన్నట్టు తప్పుడు పత్రాలతో అప్పు
- పే ఆర్డర్‌లు, బిల్లులు లేకుండా నిధులు డ్రా
- ఏడాదిన్నర క్రితం డీసీసీబీ అధికారులకు రైతులు ఫిర్యాదు
- ప్రాథమిక విచారణల పేరుతో కాలయాపన
- కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేసిన రైతులు.. విచారణకు ఆదేశం



తీసుకోని రుణాలను చెల్లించాలని జారీ అయిన జప్తు నోటీసులు చూపిస్తున్న రైతులు

రోలుగుంట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నర్సీపట్నం బ్రాంచి పరిధిలోని రోలుగుంట మండలం జానకిరాంపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో భారీ అక్రమాలు జరిగాయి. నాలుగు దశాబ్దాల నుంచి ఇక్కడే పాతుకుపోయిన సొసైటీ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) వివిధ రూపాల్లో పెద్ద మొత్తంలో నిధులు స్వాహా చేశారు. బినామీ పేర్లతో రుణాలు, భూమి లేకపోయినా ఉన్నట్టు తప్పుడు పత్రాలతో రుణాలు మంజూరు, పే ఆర్డర్‌లు, బిల్లులు లేకుండా నిధులు డ్రా చేసి ఎడాపెడా అవినీతికి పాల్పడ్డారు. ఆయా సమయాల్లో కొంతమంది పాలకవర్గ సభ్యులకు కూడా అక్రమాల్లో భాగం వుంది. సీఈవో నిధుల స్వాహాపై ఏడాదిన్నర క్రితం సొసైటీ సభ్యులు, అధికారులకు ఫిర్యాదు చేయగా, విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

జానకిరాంపురం పీఏసీఎస్ పరిధిలో కుసర్లపూడి, రొంగలిపాలెం, కాముడుపాలెం, తమరానపాలెం, జేపీఅగ్రహారం, జానకిరాంపురం, కొమరవోలు, జగ్గంపేట, పడాలపాలెం, జె.నాయుడుపాలెం, ఎల్.కొత్తూరు, గుర్రాలపాలెం, బలిజిపాలెం, కశిరెడ్డిపాలెం గ్రామాలు వున్నాయి. ప్రస్తుతం ఈ సంఘంలో 6,755 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. కొమరవోలు గ్రామానికి చెందిన బోళెం రామకృష్ణ 1987లో ఈ సొసైటీ కార్యదర్శిగా ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి ఇక్కడే పనిచేస్తున్నారు. ఈ క్రమంలో వివిధ రకాల అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారు. రైతులు తిరిగి చెల్లించిన పంట రుణాల సొమ్మును బ్యాంకుకు జమ చేయలేదు. భూమి లేని వారికి పంట రుణాలు మంజూరు చేశారు. నకిలీ సంతకాలు, వేలి ముద్రలతో ... మిగతా 8వ పేజీలో

సొసైటీ సీఈవో, ఆఫీస్ అసిస్టెంట్ సస్పెన్షన్

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) నర్సీపట్నం బ్రాంచిలోకి పెట్రోల్ క్యాన్‌తో ప్రవేశించి, ఉద్యోగులను తీవ్ర భయోదోళనకు గురి చేసిన జానకిరాంపురం పీఏసీఎస్ సీఈఓ బోళెం రామకృష్ణను, ఆఫీసు అసిస్టెంట్ మడకా దేముడులను సస్పెండ్ చేస్తూ సహకార శాఖ ఉన్నతాధికారులు బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. సొసైటీలో బినామీ రుణాలు, నిధులు పక్కదారి, తదితర ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఈఓ రామకృష్ణపై ఇప్పటికే విచారణ మొదలైంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం ఆయనతోపాటు ఆఫీసు అసిస్టెంట్ మడకా దేముడు, కంప్యూటర్ ఆపరేటర్ సాయిలు కలిసి పెట్రోల్ క్యాన్లతో బ్యాంకులోకి ప్రవేశించి కలకలం రేపి విషయం విదితమే. బ్యాంకు మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై డీసీసీబీ అధికారులు బుధవారం విచారణ చేపట్టారు. రామకృష్ణ, దేముడులను సస్పెండ్ చేశారు.

భూమి ఉన్నట్టు తప్పుడు పత్రాలు సృష్టించారు



నాకు సెంటు భూమి లేదు. కానీ నా పేరు మీద సర్వే నంబరు 398లో ఒక ఎకరా భూమి ఉన్నట్టు సొసైటీ అధికారులు తప్పుడు పత్రాలు సృష్టించారు. ఫోర్జరీ సంతకాలు, వేలిముద్రలతో సొసైటీలో సభ్యత్వం కల్పించారు. అంతేకాక ఈ భూమిపై నేను రూ.35 వేలు రుణం తీసుకున్నట్టు ఇటీవల జప్తు నోటీసులు పంపించారు. పీఏసీఎస్ అధికారులను కలిసి నా ఎకరా భూమి ఎక్కడ వుందో చూపించాలని అడుగుతున్నా స్పందించడంలేదు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు, సహకార శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు.

- గొల్లు కల్యాణ, కుసర్లపూడి

రంగురాళ్ల తవ్వకాలకు పావులు

తెరవెనుక బడాబాబులు

- పదిహేను, ఇరవై ఏళ్ల క్రితం దరఖాస్తులు ఇప్పటికీ లైవ్‌లోనే
- తాజాగా మైనింగ్ సిబ్బందితో కలిసి కరక రిజర్వు ఫారెస్టులో పరిశీలన
- మైనింగ్ శాఖ ఓఎస్‌డీ ఆదేశాలతోనే పంపామంటున్న ఏడీ



గొలుగొండ మండలం కరక రిజర్వు ఫారెస్టు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):

గొలుగొండ మండల కరక అటవీ ప్రాంతంలో రంగురాళ్ల తవ్వకాలకు బడా బాబులు పావులు కదుపుతున్నారు. ఎప్పుడో పదిహేను, ఇరవై ఏళ్ల క్రితం చేసుకున్న దరఖాస్తులు ఇప్పటికీ మైనింగ్ శాఖ వద్ద సజీవంగానే ఉన్నాయి. ఆ దరఖాస్తుదారుల్లో కొంతమంది ఇప్పుడు రంగు రాళ్ల తవ్వకాలకు రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. వాస్తవంగా రంగురాళ్ల తవ్వకాలకు అనుమతులు కోసం మైనింగ్ శాఖకు అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పరిశీలించి రెవెన్యూ, అటవీశాఖ ఉన్నతాధికారులకు పంపుతారు. ఈ మూడు శాఖలు సంయుక్తంగా సర్వే చేసిన తర్వాత నిబంధనలకు లోబడి అ



రంగురాళ్ల తవ్వకాలు జరుపుతున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

నుమతులు ఇస్తారు. లేకపోతే దరఖాస్తులను తిరస్కరిస్తారు. అయితే రంగురాళ్ల తవ్వకాల కోసం పదేళ్ల క్రితం చేసుకున్న దరఖాస్తులు మైనింగ్ శాఖ వద్ద ఇప్పటికీ లైవ్‌లో వుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఈ నేపథ్యంలో గత నెల 31వ తేదీ సాయంత్రం మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి.. నలుగురు సిబ్బందిని, ఇద్దరు రంగురాళ్ల వ్యాపారులను వెంటపెట్టుకొని కరక కొండ ఎక్కిన విషయం తెలిసిందే. అమరావతిలో మైనింగ్ శాఖ ఓఎస్‌డీ ఆదేశాలతోనే రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌ని, సిబ్బందిని సర్వేకి పంపామని మైనింగ్ ఏడీ చెప్పడం గమనార్హం. అమరావతి స్థాయిలో పావులు కదుపుతున్నారంటే రంగురాళ్ల తవ్వకాలకు పెద్ద స్థాయిలోనే ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం.


రంగురాళ్ల తవ్వకాలకు లైవ్‌లో వున్న దరఖాస్తులు

- అవ్య మైన్స్ అండ్ మినరల్స్ సంస్థ 2014లో వేర్వేరు తేదీల్లో పెట్టుకున్న నాలుగు దరఖాస్తులు మైనింగ్ శాఖలో ఉన్నాయి. గొలుగొండ మండలం కరకలో సర్వే నంబరు 195లో 20 ఎకరాలు, కరక రిజర్వ్ ఫారెస్టులో ఒక్కోచోట 20 ఎకరాలు చొప్పున 60 ఎకరాలు.. మొత్తం 80 ఎకరాల్లో తవ్వకాలకు వేర్వేరుగా దరఖాస్తులు ఇచ్చారు.
- కరకలో సర్వే నంబరు 193లో రెండు ఎకరాలు, సర్వే ... మిగతా 8వ పేజీలో

ఈ-క్రాప్ నమోదు వేగవంతం

ఈ నెల 25 వరకే గడువు

- కౌలు రైతుల వివరాలు సైతం నమోదు
- కొన్నిచోట్ల సాంకేతిక సమస్యలతో జాప్యం



ఎస్.రాయవరం మండలం పెట్టుగోళ్లపల్లిలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

రైతులు పంట నష్టపరిహారం పొందాలన్నా, వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకోవాలన్నా కీలకమైన ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను వ్యవసాయ శాఖ అధికారులు వేగవంతం చేశారు. రబీ పంటలకు సంబంధించి వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్‌ఓలు గ్రామాల్లో పర్యటిస్తూ భూమి విస్తీర్ణం, ప్రస్తుతం సాగులో వున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

గత వైసీపీ పాలకులు రైతులకు అందాల్సిన సేవలు, రాయితీల చెల్లింపుల విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేశారు. ఈ-క్రాప్ నమోదు, ఈ-కేవైసీ వంటివి పూర్తిస్థాయిలో చేయకపోవడంతో రైతులు నష్టపోయారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం నుంచి అన్ని రకాల సేవలు అందించేందుకు ప్రణాళికతో ముందుకు వెళుతున్నది. ఇందులో భాగంగా జిల్లాలో రబీ పంటల వివరాలను నమోదు చేయిస్తున్నది. వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్‌ఓలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల భూమి విస్తీర్ణం, ప్రస్తుతం సాగులోవున్న పంటల వివరాలను ఫొటోలతోసహా ఈ-క్రాప్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. రైతులు తరువాత రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి బయోమెట్రిక్ ఆథంటికేషన్ (ఈ-కేవైసీ) చేయించుకోవాల్సి ఉంటుంది. అయితే సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యల కారణంగా కొన్నిచోట్ల ఈ-క్రాప్ నమోదు నెమ్మదిగా సాగుతున్నది.

ఇదిలావుండగా కౌలు రైతుల వివరాలను కూడా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. కైలు రైతులకు గుర్తింపు కార్డులు లేకపోయినా.. పొలంలో పంటలను సాగు చేస్తుంటే ఆయా కౌలుదారుని పేరుతోనే వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ-క్రాప్ నమోదు ఈ నెల 25వ తేదీ వరకు గడువు వుంది. జిల్లాలో ... మిగతా 8వ పేజీలో

గోవాడలో క్రషింగ్‌కు మళ్లీ అంతరాయం

- 24 గంటలు గడిచినా పూర్తికాని మరమ్మతు పనులు
- ఫ్యాక్టరీ యార్డులో, కాటాల వద్ద బారులుతీరిన చెరకు బండ్లు



షుగర్ ఫ్యాక్టరీ యార్డులో చెరకుతో నిలిచిన టైరు బండ్లు

చోడవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్‌కు మరోసారి అంతరాయం ఏర్పడింది. బాయిలర్ నడవడానికి అవసరమైన బగాస్ లేకపోవడంతోపాటు, యంత్రాల్లో తలెత్తిన సాంకేతిక లోపంతో మంగళవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో కషింగ్ నిలిచిపోయింది. బుధవారం సాయంత్రం వరకూ ప్రారంభం కాలేదు. దీంతో ఫ్యాక్టరీ యార్డుతోపాటు వివిధ కాటాల వద్ద చెరకు ట్రాక్టర్లు, టైరు బండ్లు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. ఫ్యాక్టరీ యాజమాన్య తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలువురు చెరకు రైతులు బుధవారం సాయంత్రం ఫ్యాక్టరీ ఎండీ సన్యాసినాయుడు నివాసానికి చేరుకుని ఆందోళనకు ... మిగతా 8వ పేజీలో

రైల్వే డివిజన్ కొనసాగింపు

పేరు మాత్రం మార్పు

- 'వాల్తేరు' స్థానంలో 'విశాఖపట్నం'
- రైల్వే బోర్డు నిర్ణయం
- పరిధి మాత్రం భారీగా కుదింపు
- కేవలం 410 కిలోమీటర్లు మాత్రమే...
- రాయగడ డివిజన్‌లోకి కేకే లైన్



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'వాల్తేరు రైల్వే డివిజన్' అనే పదం ఇకపై వినిపించదు. చరిత్ర పుటల్లో కలిసిపోతుంది. అదే స్థానంలో కొత్తగా 'విశాఖపట్నం డివిజన్' పేరు ప్రాచుర్యంలోకి వస్తుంది. కొత్త ప్రస్థానం మొదలవుతుంది. ఇదంతా ఉత్తరాంధ్ర ప్రజల పోరాటం, రాజకీయ నాయకుల ఒత్తిడి, కార్మిక సంఘాల ఆందోళనల వల్లే సాధ్యమైంది.

దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్న రైల్వే జోన్ ఇస్తామని ఐదేళ్ల క్రితం కేంద్రం ప్రకటించినా మరోవైపు వాల్తేరు డివిజన్ ఉండదని, దానిని రద్దు చేస్తామని పేర్కొంది. దాంతో కొత్త జోన్ వస్తుందనే సంతోషం ఎవరిలోనూ కనిపించలేదు. వేల కోట్ల రూపాయల ఆదాయం సమకూరుస్తూ, 132 సంవత్సరాల చరిత్ర కలిగిన వాల్తేరు డివిజన్‌తో కూడిన జోన్ ఇవ్వాలనే డిమాండ్ మొదలైంది. గత నెలలో జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసినప్పుడు కూడా నాయకులు అదే కోరారు. అయితే ప్రధాని నరేంద్రమోదీ గాని, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ గానీ దీనిపై పెదవి విప్పలేదు. వాల్తేరు డివిజన్ ఉంచుతారో లేదో చెప్పకుండానే జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. మరోవైపు ఒడిశాలోని రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటుచేశారు. వాల్తేరు డివిజన్‌లో కీలకమైన, అధిక ఆదాయం సాధించే రైలు మార్గాలను కలపనున్నట్టు ప్రచారం మొదలైంది. వాల్తేరు డివిజన్‌లో కొత్తవలస-కిరండూల్ లైన్ చాలా ప్రత్యేకం. బైలదిల్లా నుంచి ముడిఇనుము భారీగా రవాణా జరుగుతోంది. దీని ద్వారానే డివిజన్‌కు వేల కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. దానిని రాయగడ డివిజన్‌లో కలిపేస్తారని ప్రచారం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటన్నింటిపై కేంద్ర మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ఈ ప్రాంత ఎంపీలు ఎం.శ్రీభరత్, సీఎం రమేశ్, తదితరులు ఢిల్లీ పెద్దలపై ఒత్తిడి పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లోను వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాల్సిందేనని, రద్దు చేస్తే ప్రజలకు సమాధానం చెప్పుకోలేమని వివరించారు. దీనికి ... మిగతా 8వ పేజీలో

టూరిజం స్పాట్‌గా తాండవ

రిజర్వాయర్ ప్రాంతం అభివృద్ధికి చర్యలు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు



సభలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):

తాండవ రిజర్వాయర్ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేస్తామని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. బుధవారం తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ ఆధ్వర్యంలో అన్ని నీటి సంఘాల డైరెక్టర్లతో జలాశయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ పాలనలో తాండవ ప్రాజెక్టు తీవ్ర నిర్లక్షానికి గురైందన్నారు కనీసం మెయిన్‌గేట్లు లీకేజీలను కూడా అరికట్టలేదన్నారు. తాండవ రోడ్డును ఆర్‌అండ్‌బీలో విలీనం చేసి అభివృద్ధికి చర్యలు చేపడతానన్నారు. తాండవ నుంచి గొలుగొండ మండలం జోగంపేట వెళ్లే రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. తాండవ లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి నిధులు మంజూరు చేస్తానని సీఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ... మిగతా 8వ పేజీలో

మొబైల్ ఫోన్ల రికవరీకి తీవ్ర కృషి

- ఎస్పీ తుహిన్‌సిన్హా
- తొమ్మిదో విడత 503 సెల్ ఫోన్లు బాధితులకు అందజేత



రికవరీ చేసిన మొబైల్ ఫోన్‌లను చూపిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):

వివిధ ప్రాంతాల్లో ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి, వాటిని బాధితులకు అందించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తున్నదని ఎస్పీ తుహిన్‌సిన్హా పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో తొమ్మిదో విడత రికవరీ చేసిన 503 మొబైల్ ఫోన్‌లను ఆయన బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటి వరకు 4,500 మొబైల్ ఫోన్‌లు పోగొట్టుకోవడం లేదా చోరీకి గురైనట్టు ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో 2,711 మొబైల్ ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అందించామన్నారు. వీటి విలువ రూ.4.07 కోట్లు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా మొబైల్ ట్రాకింగ్ సర్వీస్ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని ఆయన చెప్పారు. మొబైల్ ఫోన్ల రికవరీలో విశేషంగా కృషి చేసిన సోషల్ మీడియా ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ఐటీ కోర్ ఎస్‌ఐ సురేశ్‌బాబు, ఐటీ కోర్ సిబ్బందిని ఎస్పీ తుహిన్‌సిన్హా అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మోహనరావు, ఎస్‌బీ డీఎస్పీ అప్పారావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు బాల సూర్యారావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడుతో వెళుతున్న రెండు లారీలకు జరిమానా



పట్టుబడిన లారీలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి సమీపంలో అధిక లోడుతో వెళుతున్న రెండు లారీలను బుధవారం పట్టుకుని ఆర్టీవోకి పంపించగా, వాటికి రూ.1.1 లక్షలు జరిమానా విధించినట్టు ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అధిక లోడుతో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీతపాలెం కాలువలో చనిపోయిన చేపలు



కాలువలో చనిపోయిన చేపలను చూపుతున్న మత్స్యకారుడు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సీతపాలెం కాలువలో చేపలు చనిపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సీతపాలెం కాలువ పూడిమడక ఉప్పుటేరులో కలుస్తుంది. అయితే ఈ కాలువ ద్వారా కర్మాగారాల నుంచి విడుదలైన వ్యర్థ జలాలు వచ్చి నేరుగా పూడిమడక ఉప్పుటేరులో కలుస్తున్నాయి. పోటు సమయంలో సముద్ర జలాలు ఉప్పుటేరు ద్వారా కాలువలోకి వస్తున్నాయి. పోటు సమయంలో సముద్రపు నీటితో పాటు చేపలు కూడా సీతపాలెం కాలువలోకి వస్తున్నాయి. కాలుష్య జలాలు ఉండడంతో చనిపోతున్నాయని మత్స్యకార నాయకుడు చేపల తాతలు తెలిపారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీల్లో పోషకాహారం పూర్తి స్థాయిలో అందించాలి

మునగపాక, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పూర్తిస్థాయిలో పోషకాహారం పంపిణీ చేయాలని సర్పంచ్ దిమ్మల అప్పారావు సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో టీచర్లు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

టీడీపీ రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు జనరాజదాస్‌కు నివాళి

మునగపాక, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఉమ్మడి రూరల్ జిల్లా మాజీ అధ్యక్షుడు పెంటకోట జనరాజదాస్‌కు స్థానిక నేతలు నివాళులర్పించారు. స్థానిక గ్రామీణ యువజన మందిరం వద్ద బుధవారం జనరాజదాస్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీ సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగ్గారావు, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

'కల్లుగీత కార్మికులు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవాలి'

అచ్యుతాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కల్లుగీత కార్మికులకు మంజూరైన రెండు మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకోవాలని ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ తేజో వెంకటకుమార్ కోరారు. రాంబిల్లి మండలంలో శెట్టి బలిజ కులం, ఎలమంచిలి రూరల్ మండలంలో గౌడ కులానికి షాపులు కేటాయించారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా అనకాపల్లి జిల్లా వాసులై ఉండాలని, ఈ నెల 8న సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

అధిక దిగుబడినిచ్చే చెరకు రకాలను సాగు చేయాలి

» రైతులకు ఏవో మోహనరావు సూచన

ఎలమంచిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడినిచ్చి అధిక రసం కలిగే చెరకు రకాలను రైతులు సాగుచేసినట్టయితే లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికారి మోహనరావు సూచించారు. బుధవారం కొక్కిరాపల్లి, తురంగలపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక రైతులతో మాట్లాడుతూ చెరకు సాగు చేసే రైతులు అధికంగా తెల్లబూంది రకం సాగుచేస్తున్నారని, వేరే రకాలు మార్చినట్టయితే ఎక్కువ రసం దిగుబడి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ గ్రామ సహాయకులు అరుణ, రైతులు రమణ, కృష్ణ, ఆదినారాయణ, తోట గణేశ్, బీముని రమణ పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో కృష్ణంపాలెం

» ఎస్ఈజెడ్‌లోని కంపెనీల కాలుష్యంతో గ్రామస్థులు విలవిల

» పట్టించుకోని పాలకులు, అధికారులు

» గ్రామాన్ని తరలించాలని కోరుతున్న ప్రజలు



కృష్ణంపాలెం గ్రామం

రాంబిల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఎస్ఈజెడ్‌లోని పలు పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యంతో మండలంలోని కృష్ణంపాలెం గ్రామస్థులు అల్లాడిపోతున్నారు. సెజ్‌లో సుమారు 200కిపైగా పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో అధికంగా ఫార్మా కంపెనీలున్నాయి. కృష్ణంపాలేనికి అతి సమీపంలో ఉన్న ఫార్మా కంపెనీల నుంచి కాలుష్యం అధికంగా గ్రామం మీదకు వస్తుందని, భరించలేని వాసన వస్తుందని, ఇళ్లలో ఉండలేకపోతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. కంపెనీల యాజమాన్యాలు రాత్రి సమయాల్లోనే కాలుష్యాన్ని విడుదల చేస్తున్నాయని వారు చెబుతున్నారు. ఈ కాలుష్యంతో ఊపిరితిత్తులు, గుండె జబ్బు సమస్యలు, కిడ్నీ, చర్మవ్యాధులు, గొంతు క్యాన్సర్, తదితర అనారోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తున్నదని వాపోయారు. గ్రామంలోని నీరు కూడా కలుషితమైపోయిందని, తాగడానికి అనుకూలంగా లేదని గ్రామస్థులు చెబుతున్నారు. కంపెనీలు ఏర్పాటు చేసినప్పుడు ప్రజాభిప్రాయ సేకరణలో పర్యావరణానికి



కృష్ణంపాలెం గ్రామ సమీపంలో ఎస్ఈజెడ్‌లోని పరిశ్రమలు

సంబంధించి ఎటువంటి ఇబ్బందులు ఉండవని అధికారులు చెప్పి నమ్మించారని, కంపెనీలు నుంచి వెలువడే కాలుష్యం వలన అన్నివిధాల ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీల నుంచి నల్లటి బొగ్గులాంటి పౌడర్ గ్రామాల్లోని ఇళ్లపై పడుతున్నదని, పంటలపై కూడా ఈ కెమికల్‌తో కూడిన పౌడర్ పడుతుండడంతో దెబ్బతింటున్నాయని కృష్ణంపాలెం గ్రామస్థులు తెలిపారు. కాలుష్యం తాకిడికి దెబ్బతిన్న పంటలకు మందులు కొట్టినా ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదని వారు వాపోయారు. ఈ పరిస్థితి ఇలాగే ఉంటే తమ జీవనాధారమైన వ్యవసాయం, పాడిని కూడా నష్టపోతామని, దీంతో కుటుంబాలతో రోడ్డున పడాల్సిన పరిస్థితి వస్తుందని అంటున్నారు. ఇప్పటికే కృష్ణంపాలెం పంచాయతీలో ఏపీఐఐసీ అధికారులు 80 శాతం భూములు, ఇళ్లను కూడా తీసుకున్నారని, 20 శాతం కుటుంబాలు మాత్రమే గ్రామంలో ఉన్నాయన్నారు. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి కంపెనీల నుంచి వెలువడే కాలుష్యం నుంచి గ్రామాన్ని కాపాడాలని, లేకుంటే 20 శాతం ఉన్న గ్రామాన్ని తరలించాలని కృష్ణంపాలెం గ్రామస్థులు వేడుకుంటున్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ ఆందోళనలు

» సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనలు

ఎలమంచిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సీఐటీయూ నాయకులు ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్‌లో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జానకి, శ్రీను, వరలక్ష్మి, ప్రసన్న, అప్పలరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం: అచ్యుతాపురం జంక్షన్‌లో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, కె.సోమునాయుడు, లోకేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి: సీఐటీయూ ఆధ్వర్యంలో రాంబిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడునాయుడు, మండల కన్వీనర్ చందక రామకృష్ణ, ఎన్ఏపీబీ, భవన నిర్మాణ, ఆటో, ముఠా, తదితర రంగాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ



ఎలమంచిలి మండలంలోని లైనుకొత్తూరు గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఎలమంచిలి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని లైనుకొత్తూరు గ్రామంలో బుధవారం క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. లైనుకొత్తూరులోని వెలుగు స్త్రీ శక్తి భవనంలో డ్వాక్రా సభ్యులు, రేగుపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు శిరీష, మండల సమాఖ్య అధ్యక్షురాలు వెంకటరమణి, ఏరియా కో-ఆర్డినేటర్ సత్యవేణి, ఏపీఎం రాణి, వెలుగు సీసీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి: స్థానిక శ్రీశక్తిభవనంలో వెలుగు వీవోఏలు, హెల్త్ వర్కర్లకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాంబిల్లి, దిమిలి ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు డాక్టర్ వెంకటేశ్, డాక్టర్ అనిల్‌కుమార్, వెలుగు ఏపీఎం పద్మ, వెలుగు సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం: స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో బుధవారం క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారిణి శ్రావ్య, ఏపీఎం శ్రీనివాసరావు, సీహెచ్‌వో వేణుగోపాలరావు, సీసీలు శ్రీను, రాజారమేశ్, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

బార్క్ ప్రాంతంలో కలెక్టర్ పర్యటన



బార్క్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) ప్రాంతంలో కలెక్టర్ విజయకృష్ణన్ బుధవారం పర్యటించారు. ముందుగా ఆమె మడుతూరు వద్ద గల బార్క్ పరిపాలనా భవనంలో బార్క్ అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. బార్క్ భూసేకరణలో నిర్వాసితులకు పరిహారం, పునరావాసం, తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం బార్క్ ప్రాజెక్ట్ ప్రాంతాన్ని ఆమె సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట రెవెన్యూ అధికారులున్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

» సీఐ గణేశ్

అచ్యుతాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్‌కి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నమ్మి గణేశ్ హెచ్చరించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం అచ్యుతాపురంలోని పాఠశాలలు, కళాశాలల వద్ద తమ సిబ్బందితో మఫ్టీలో నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఐదుగురు వ్యక్తుల్ని అనుమానితులుగా భావించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. విద్యాసంస్థల వద్ద ఎవరైనా అపరిచిత వ్యక్తులు, విద్యార్థులు కానివారు, అనుమానాస్పదంగా ఉన్న వారిని గుర్తించి తమకు తెలియజేయాలని ఆయన కోరారు.

కమ్మేసిన పొగమంచు



వెంకటాపురం- రాంబిల్లి రోడ్డులో బుధవారం ఉదయం లైట్ల వెలుతురులో వెళుతున్న వాహనాలు

రాంబిల్లి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మన్యాలను తలపించే విధంగా బుధవారం మండలంలోని పలు గ్రామాలను పొగమంచు కప్పేసింది. దీంతో వాహనచోదకులు, పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 10 గంటల వరకు పొంగ మంచు పడుతూనే ఉండడంతో గ్రామాలు, రోడ్లు, కొండలు, వ్యవసాయ పొలాలు కనిపించలేదు. వాహనదారులు లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించారు.

అచ్యుతాపురంలో..

అచ్యుతాపురం: మండలంలో బుధవారం ఉదయం మంచు దట్టంగా కురిసింది. ఉదయం 9 గంటల వరకు మంచు కురవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కూడా కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సెజ్ కర్మాగారాలకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులను తీసుకు వెళుతున్న బస్సులు హెడ్‌లైట్ల వెలుతురులో ప్రయాణించాల్సి వచ్చింది.

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు

» డిప్యూటీ డీఈవో అప్పారావు



పెదరాంభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని డిప్యూటీ డీఈవో పెన్నాడ అప్పారావు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని పెదరాంభద్రపురం, రాజానగరం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న గ్రూపు స్టడీ సెంటర్‌లను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులతో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు ముగిసే వరకు విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేకుండా చదవాలని, అపుడే మంచి ఫలితాలు సాధించగలరన్నారు. గ్రూపు స్టడీ సెంటర్‌లు ఏర్పాటు చేసి చదివిస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 జి.రమేశ్‌బాబు, ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, షేక్ కోదండరాం రహీమ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ పిట్టా గణేశ్ పాల్గొన్నారు.

రబీ సాగుపై రైతులకు అవగాహన

నక్కపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డొంకాడ, ముకుందరాజుపేట, గొడిచెర్ల గ్రామాల్లో రబీలో వరి సాగుపై ఎటువంటి యాజమాన్య పద్ధతులు పాటించాలో ఏవో ఉమాప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ గ్రామాల్లో వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి క్షేత్ర పర్యటన చేశారు. మండలంలో 110 ఎకరాల్లో వరి, 1,050 ఎకరాల్లో అపరాలు సాగవుతున్నాయని చెప్పారు. సస్యరక్షణ చర్యలు గురించి వివరించారు.ఏఈవో సత్యనారాయణ, సురేంద్ర, రజిత పాల్గొన్నారు.

పలువురికి టీడీపీ నాయకుల పరామర్శ



మాసాహెబ్‌పేటలో బొలిశెట్టి రమణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకులు

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేటలో ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు బొలిశెట్టి రమణ కుటుంబ సభ్యులను బుధవారం టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు పరామర్శించారు. అదేవిధంగా మంగవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కోనే కొండబాబు రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమవ్వడంతో పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, కంకిపాటి వెంకటేశ్వరరావు, దేవవరపు గోవిందు, అనిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

50 పడకల ఆస్పత్రిలో సేవలపై పెదవివిరుపు

» మండల సమావేశంలో సభ్యుల అసంతృప్తి



ఆస్పత్రి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఆకేటి గోవిందరావు

నక్కపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక 50 పడకల ఆస్పత్రి పనితీరు బాగో లేదని, రోగులకు సకాలంలో సేవలందించడం లేదని, అవసరం లేకపోయినా కొన్ని కేసులను విశాఖ రిఫర్ చేసేస్తున్నారని కాగిత ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు ఆరోపించారు. బుధవారం ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన నిర్వహించిన మండల సమావేశంలో వైద్యసేవలపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. గొడిచెర్ల పీహెచ్‌సీలో కూడా సరైన వైద్యసేవలు అందడం లేదని, ఏఎన్ఎంలు గ్రామాల్లో తిరగడం లేదని వేంపాడు ఎంపీటీసీ సభ్యుడు కుంచె మధు అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని, జలజీవన్ మిషన్ పనులు సకాలంలో పూర్తి చేయాలని పెదబోదిగల్లం సర్పంచ్ మున్నీషాబేగం, ఉపమాక ఎంపీటీసీ సభ్యురాలు కొల్లాటి పార్వతి కోరారు. దీనిపై స్పందించి ఎంపీడీవో డి. సీతారామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ నాగభూషణం మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఆస్పత్రులపై ఆరోపణలు, ఫిర్యాదులు రాకుండా వైద్య సిబ్బంది అంకితభావం, మానవీయ కోణంలో సేవలందించాలని వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

దోషులను పట్టుకోకుండా కొత్త విగ్రహం పెట్టడం సరికాదు

» డీబీపీ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్



సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణస్వరూప్

పాయకరావుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కులో డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను అరెస్టు చేయకుండా అదే స్థలంలో కొత్త విగ్రహం ఏర్పాటుచేయడం సరికాదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. మంగళవారం స్థానిక డీబీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జరిగిన సంఘటనపై పూర్తి విచారణ చేసి దుండగులను గుర్తించి అరెస్టు చేయాలన్నారు. కొత్త విగ్రహం ఏర్పాటుచేసి, చేతులు దులుపుకోవడానికి ప్రభుత్వం, పోలీసులు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేసి జిల్లా ఎస్పీ నేతృత్వంలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనపై విచారణ చేయించకుంటే ఆందోళన చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమంలో డీబీపీ జిల్లా అధ్యక్షుడు దావ్వాడ దావీదు, రాష్ట్ర నాయకురాలు దాసరి అన్నపూర్ణ, మాలమహానాడు అసెంబ్లీ ఇన్‌చార్జి బడుగు అచ్చారావు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతో క్యాన్సర్‌ని నియంత్రించవచ్చు : డాక్టర్ సౌందర్య



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సౌందర్య

పాయకరావుపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా క్యాన్సర్‌ని నియంత్రించవచ్చన్న విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని పట్టణ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సౌజన్య తెలిపారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వీఓఏలు, ఈసీ సభ్యులకు క్యాన్సర్ లక్షణాలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు అందుబాటులో ఉంటారని, ఇక నుంచి ప్రతిరోజూ గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలను తెలియజేయాలన్నారు. అనంతరం కరపత్రాలను సిబ్బందికి పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెలుగు సీసీ, వీఓఏ, ఈసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నక్కపల్లిలో..

స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం క్యాన్సర్‌పై మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. నక్కపల్లి 50 పడకల ఆస్పత్రి మెడికల్ ఆఫీస్ డాక్టర్ జయలక్ష్మి క్యాన్సర్ లక్షణాలు, రకాల గురించి వివరించారు. ఐసీటీఎస్ కౌన్సిలర్ ఆర్. రమణమ్మ బెస్ట్ క్యాన్సర్, సర్వైకల్, ఓరల్ క్యాన్సర్ల గురించి అవగాహన కల్పించారు. ఏపీఎం శ్రీనివాస్, సీసీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మేనత్తకు తలకొరివి పెట్టిన మేనకోడలు



ఎస్.రాయవరంలో మేనత్తకు తలకొరివి పెడుతున్న మేనకోడలు గజ్జల వరలక్ష్మి

ఎస్.రాయవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అద్దంకి కాంతం(75) మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఆమెకు అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో మేనకోడలు గజ్జల వరలక్ష్మి తలకొరివి పెట్టింది. దీనికి సంబంధించి గ్రామస్థులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్.రాయవరంలో అద్దంకి కాంతం భర్తతో పాటు ఆమె కుమారుడు, కూతురు కూడా మృతి చెందారు. అయితే కాంతం మనుమడు, మనవరాలు ఉన్నప్పటికీ చిన్నప్పుడే తన తండ్రి కోల్పోడంతో ఆ ఇద్దరూ 25 ఏళ్ల క్రితం తల్లితోపాటు రాజమండ్రి వెళ్లిపోయారు. నానమ్మ చనిపోయిందనే విషయం తెలుసుకొని వారిద్దరూ తల్లితో కలిసి వచ్చినప్పటికీ వారు అంత్యక్రియలకు దూరంగా ఉన్నారు. దీంతో మృతురాలు కాంతానికి తలకొరివి పెట్టేవారు ఎవరూ లేకపోవడంతో ఆఖరికి కాంతం తమ్ముడు కుమార్తె వరలక్ష్మి ముందుకు వచ్చి మేనత్తకు అంత్యక్రియలు నిర్వహించింది.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం



కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

నక్కపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.నర్సాపురంలో సీపీఎం మండల కన్వీనర్ ఎం.రాజేశ్ ఆధ్వర్యంలో కేంద్రబడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కేంద్ర బడ్జెట్ వల్ల ఒరిగిందేమీ లేదని, ఏపీకి, ఉపాధి కూలీలు, కర్షక, కార్మికులకు న్యాయం చేసే విధంగా బడ్జెట్ లేదన్నారు. కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు గొర్ల రమణ, మనబాల రమణ, కుండల రమణ, వియ్యపు ప్రసాద్ పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాలను వినియోగించాలి

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తప్పనిసరిగా వినియోగించాలని ఈవోపీఆర్డీ సీహెచ్ చంద్రశేఖరరావు అన్నారు. మండలంలోని మంగవరం, నామవరం, అరట్లకోట గ్రామాలలోని సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లోని రోడ్లపై చెత్తా చెదారాలను సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. నామవరంలో సంపద కేంద్రంలో తయారైన వర్మీ కంపోస్టును విక్రయించగా వచ్చిన రూ.3,100ను పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ చేశారన్నారు. అదేవిధంగా మంగవరంలో 780 రూపాయలు, అరట్లకోటలో 800 రూపాయలకు వర్మీకంపోస్టును విక్రయించగా పంచాయతీ జనరల్ ఫండ్‌లో జమ చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జునాచారి, కొండలరావు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

15వ తేదీ నాటికి ఈకేవైసీ పూర్తి చేయాలి

» జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

ఎస్. రాయవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఈ-పంట నమోదు, ఈకేవైసీలను ఈనెల 15వ తేదీలోగా శతశాతం పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని పెట్టుగోళ్లపల్లి, పెదగుమ్ములూరు గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి, ఈ-పంటకు సంబంధించిన సూపర్‌వైజరీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెబ్‌లాండ్‌లో ఉన్న రైతులందరూ రిజిస్ట్రీ పోర్టల్ నమోదు చేయించుకోవాలని సూచించారు. అలాగే అపరాల పంటల అధిక దిగుబడికి సంబంధించి తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో సౌజన్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను వినియోగించుకోవాలి

» వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.ఉమాప్రసాద్

పాయకరావుపేట రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను వినియోగించుకోవాలని పాయకరావుపేట ఏడీఏ ఉమాప్రసాద్ కోరారు. మండలంలోని నామవరంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు ఎన్‌పీఎస్ఎస్ యాప్, అపరాల సాగులో తీసుకోవలసిన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు అపరాల సాగులో సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్‌తో రైతులే స్వయంగా తమ పొలాలోని పంటల చీడపీడలను తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టవచ్చన్నారు. కలుపు నివారణకు ఇమేజితపైరా 2.5 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కురందాసు శివ, పల్లా బాబూరావు, సిబ్బంది శ్రావణ్‌కుమార్, రమ్య, వీరబాబు, రైతులు పాల్గొన్నారు.

నేడు అడవిరాజుబాబులు పండుగ


కృష్ణాదేవిపేట ఆలయంలోని అడవిరాజుబాబులు ప్రతిమలు

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట అల్లూరి పార్కు వద్ద గల అడవి రాజుబాబుల పండుగ గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త కొమ్మనాపల్లి రామారావు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏటా ఈ ఆలయం వద్ద జరిగే పండుగకు కొయ్యూరు, గొలుగొండ, నాతవరం, చింతపల్లి, తదితర మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు. రాజుబాబుల ఈ పండుగకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని ధర్మకర్త కొమ్మనాపల్లి రామారావు కోరారు.

జిల్లా స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శనలు రేపు

చీడికాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుపురంలో జిల్లా స్థాయి ఎడ్ల పరుగు ప్రదర్శనలు ఈ నెల 7న నిర్వహించనున్నట్టు సర్పంచ్ చుక్క అప్పలనాయుడు బుధవారం తెలిపారు. అభయాంజనేయ తీర్థం సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎడ్ల పరుగు ప్రదర్శనలో పాల్గొనే వారు 9963299578 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కె.కోటపాడులో కంటి వైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ హరిచందన

కె.కోటపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కె.కోటపాడులో జిల్లా బ్లడ్ కో-ఆర్డినేటర్ పైలా గోపి ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది కంటి రోగులు పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 15 మంది కంటి ఆపరేషన్లకు అర్హులు కాగా, వీరికి శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఆపరేషన్ నిర్వహిస్తారని ఇన్‌చార్జి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యనిపుణురాలు డాక్టర్ హరిచందన, సహాయకులు సునంద, వనజ, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

నాతవరంలో సినిమా షూటింగ్


నాతవరంలో సినిమా షూటింగ్ జరుగుతున్న దృశ్యం

నాతవరం ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నాతవరంలో బుధవారం ఆ అమ్మాయి టైటిల్‌తో సినిమా షూటింగ్ జరిగింది. ప్రసాద్ ఉర్ల దర్శకత్వంలో హీరో గౌరీనాయుడు, హీరోయిన్ యామినిలతో యు అండ్ ఐ టీమ్ సభ్యులు జాతర పాట సన్నివేశాన్ని చిత్రీకరించారు.

టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ


గవరవరం హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావు నాయుడు

» డీఈవో గిడ్డి అప్పారావు నాయుడు

చోడవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు సూచించారు. మండలంలోని గవరవరం, దుడ్డుపాలెం జడ్పీ హైస్కూళ్లను బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల తీరును పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పది పరీక్షల భయం లేకుండా వెనుకబడిన విద్యార్థులపై మరింత శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వరరావు, ఎంఈవోలు తిరుపతిరావు, సింహాచలం, హెచ్ఎం సుందర్‌సింగ్, శోభారాణి సీఆర్పీ కేవీఎం నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

నర్సీపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పెద్దబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 70 మంది విద్యార్థులకు బుధవారం స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక సీటి క్లబ్, సహస్ర దంత వైద్యశాల వైద్యులు ఆర్థిక సహాయంలో స్టడీ మెటీరియ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బొంతు జగదీష్ బాబు దంపతులు, సిటి క్లబ్ సెక్రటరీ చింతు, ట్రెజరర్ బొంతు రమేశ్, ఉపాధ్యాయులు అల్లు అప్పారావు, బాబీ మాస్టారు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల స్థలంలో రోడ్డు నిర్మాణంపై ఆరా


అధికారులతో మాట్లాడుతున్న నర్సీపట్నం ఆర్‌డీవో వీవీ రమణ

మాడుగుల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మాడుగుల డిగ్రీ కళాశాల భవనానికి కేటాయించిన స్థలంలో రహదారి నిర్మిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు బుధవారం నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ ఆ స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ రమాదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు అటుగా బస్సుల రాకపోకలు సాగించేందుకు రోడ్డు నిర్మాణం చేశారని బదులిచ్చారు. డిగ్రీ కళాశాలకు కేటాయించిన స్థలంలో రోడ్డు ఎలా వేస్తారని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో కొంకి అప్పారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు వున్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలంలోని ఆక్రమణ తొలగింపు


చోద్యంలో ఆక్రమణను తొలగిస్తున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం చోద్యం జంక్షన్ ఆర్‌అండ్‌బీ స్థలంలో ఉన్న దుకాణాన్ని అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ఈ ఆక్రమణపై ఓ వ్యక్తి కోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చి గొలుగొండ ఆర్ఐ నాగరాజు, నర్సీపట్నం ఆర్‌అండ్‌బీ జేఈఈ ప్రసాద్, కృష్ణాదేవిపేట పోలీసుల ఆధ్వర్యంలో ఆక్రమణను తొలగించారు.

సేవలు ఘనం.. సౌకర్యాలు శూన్యం

» పశువుల ఏరియా ఆస్పత్రిలో వసతి లేమితో ఇబ్బందులు
» ఆపరేషన్ థియేటర్ లేక ఆరుబయట శస్త్ర చికిత్సలు
» ఆస్పత్రి ముందు ఉన్నశిథిల భవనంతో బెంబేలు


నర్సీపట్నం పశువుల ఏరియా ఆస్పత్రి, (ఇన్‌సెట్‌లో) పశువుల ఆస్పత్రి ముందు శిథిలావస్థలో ఉన్న పాత భవనం

నర్సీపట్నం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పశువుల ఏరియా ఆస్పత్రిలో సరైన వసతి, సౌకర్యాలు లేక వైద్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నర్సీపట్నం పశువుల ఆస్పత్రి పరిధిలో నర్సీపట్నం, గొలుగొండ మండలాలతో పాటు రోలుగుంట, నాతవరం, కోటవురట్ల, మాకవరపాలెం మండలాల నుంచి పశు వైద్యానికి వస్తుంటారు. ప్రతి రోజూ 10 నుంచి 15 పశువులు, 60 నుంచి 70 పెంపుడు కుక్కలను వైద్య సేవలు కోసం తీసుకు వస్తుంటారు.

ఆస్పత్రిలో సౌకర్యాలు లేక అవస్థలు

చుట్టు పక్కల మండలాల నుంచి వచ్చే పశు వైద్యులకు కనీసం ఒక ఆఫీసు రూమ్ కూడా లేదు. ఏరియా ఆస్పత్రి ఏడీ రూమ్‌లోనే కుర్చొంటున్నారు. ఆపరేషన్ థియేటర్ లేక పశువులకు ఆరుబయట శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. దీని వలన పశువులు, కుక్కలు ఇన్‌ఫెక్షన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. శిక్షణ కోసం ప్రతి రోజూ 25 మంది డిప్లొమా విద్యార్థులు ఏరియా ఆస్పత్రికి వస్తున్నారు. మరుగుదొడ్ల సౌకర్యం లేక వారంతా అవస్థలు పడుతున్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాలకు ఇప్పుడున్న మీటింగ్ హాల్ సరిపోవడం లేదు. 60 మంది పట్టే పెద్ద మీటింగ్ హాల్ అవసరం.

పశువుల ఆస్పత్రి ముందు శిథిల భవనం

నర్సీపట్నం పశువుల ఆస్పత్రి ముందు శిథిలావస్థలో ఉన్న పాత భవనంతో భయం భయంగా ఉంటున్నారు. పాడుబడిన భవనం ఎప్పుడు కూలిపోతుందోనని ఆస్పత్రి సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం కూలగొట్టాలని ఏడీ డాక్టర్ రాంబాబు.. ఎంపీడీవోకి లేఖ రాశారు. ఆస్పత్రి సిబ్బంది, వైద్యులతో పాటు రైతులు, స్థానికులు ఆస్పత్రి ప్రాంగణంలో తిరుగుతుంటారు. జరగరానిది ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. తక్షణమే పాడుబడిన భవనాన్ని తొలగించాలని కోరుతున్నారు. దీనిపై ఏడీ రాంబాబుని వివరణ కోరగా... ప్రమాదకరంగా ఉన్న పాడుబడిన భవనాన్ని కూలకొట్టాలని ఎంపీడీవోకి లిఖిత పూర్వకంగా కోరామని తెలిపారు. ఏరియా పశువుల ఆస్పత్రిలో వసతి సరిపోవడం లేదని, అదనపు భవనం కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని ఆయన చెప్పారు.

గోవాడ క్రషింగ్ ఆగడంతో చెరుకుకు చేటు

» వారం రోజులుగా కాటాల వద్దనే ఉన్న చెరకు
» రైతుల కళ్లాల వద్ద ఎండిపోతున్నవైనం


అప్పలరాజుపురం కాటా వద్ద ఎండిపోతున్న చెరకు


కళ్లాల వద్ద ఎండిపోతున్న చెరకు

చీడికాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్స్ క్రషింగ్‌కి అంతరాయం ఏర్పడడంతో మండలంలోని పలు చెరకు కాటాల్లో చెరకు నిలిచిపోయింది. మండలంలోని అప్పలరాజుపురం, వరహాపురం, చెట్టుపల్లి చెరకు తూనిక కేంద్రాల వద్ద చెరకు నిలిచిపోయి అది ఎండిపోవడంతో పాటు చెరకు సరఫరాకు కటింగ్ పర్మిట్లు తీసుకున్న రైతులు సైతం తమ కళ్లాల వద్దనే చెరకు ఉంచుకోవాల్సి వస్తుందని పలువురు తెలిపారు. ఇప్పటికే పండిన పంటకు గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్న రైతులకు చెరకు తూనిక కేంద్రాల్లో వారం రోజులుగా ఉన్న షుగర్స్ అంతరాయం ఒక పక్క, కళ్లాల వద్ద చెరకు సరఫరాకు నిలిచిపోయిన చెరకు మరోపక్క ఉండడంతో ఆందోళన చెందుతున్నారు. వెంటనే షుగర్స్ యాజమాన్యం స్పందించి క్రషింగ్‌కి అంతరాయం లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

కేన్సర్ పట్ల అప్రమత్తం


మాట్లాడుతున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేన్సర్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువగా మహిళలకు రొమ్ము, గర్భాశయం, నోటి కేన్సర్ వస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మంగ, వైద్యాధికారి శ్రీవిద్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

చీడికాడ: రొమ్ము కేన్సర్ పట్ల అవగాహన అవసరమని మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి శ్రీదేవి అన్నారు. మండలంలోని అప్పలరాజపురం, ఖండివరం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో రొమ్ము కేన్సర్ పట్ల గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకురాలు చిన్నమ్మలు, ముత్యాలమ్మ, గౌరీ, శ్యామల, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

లక్ష్యం దిశగా ధాన్యం కొనుగోళ్లు

- చిరంజీవి, వ్యవసాయాధికారి



మండలంలో నిర్దేశించిన లక్ష్యం మేరకు ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నాం. అనుకున్న లక్ష్యాన్ని చేరతాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు విక్రయించుకునేలా విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఈ ఏడాది ధాన్యం డబ్బులు 24 గంటల్లో రైతుల ఖాతాల్లో పడ్డాయి.

ప్రశ్న: ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం ఎంత?

జవాబు: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ద్వారా 600 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశాం. ఇప్పటికే సుమారు 560 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. గత ఏడాది 450 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేయగలిగాం. ఈ ఏడాది ఇంకా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. అనుకున్న లక్ష్యం సాధిస్తాం

ప్రశ్న: రైతులకు గిట్టుబాటు ధర అందుతుందా?

జవాబు: ఈ ఏడాది ఖరీఫ్‌లో మండలంలో 4,100 హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. అధిక సంఖ్యలో రైతులు ఈ ఏడాది ధాన్యం కొనుగోలు కేంద్రాలకు విక్రయించారు. ధాన్యం వంద కిలోల బస్తా రూ.2,300 నుంచి రూ.2,330 వరకు ధర వచ్చింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు విక్రయించుకునేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశాం.

ప్రశ్న: ధాన్యం కొనుగోలు నగదు రైతులకు ఎన్ని రోజుల్లో జమ అయ్యింది?

జవాబు: ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లోకి 24 గంటల్లో జమ అయ్యాయి. అలాగే ధాన్యం సచివాలయాలకు తరలించేందుకు ప్రభుత్వం సులభ పద్ధతి ఏర్పాటు చేసింది. రైతుకు ఎటువంటి కష్టం లేకుండా ప్రభుత్వానికి ధాన్యం అమ్మకం జరిపారు.

ప్రశ్న: రబీలో అపరాలు విత్తనాలు ఎంత రాయితీకి ఇచ్చారు?

జవాబు: మండలంలో రబీ సాగుకి ఈ ఏడాది 40 శాతం రాయితీతో అపరాలను రైతులకు పంపిణీ చేశాం. అలాగే అధికశాతం మంది రైతులు అపరాల సాగు చేపట్టారు.

- మాకవరపాలెం, ఆంధ్రజ్యోతి

అల్లూరి పార్కులో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు

» జడ్పీ సీఈవో నారాయణమూర్తి


కృష్ణాదేవిపేట పార్కును పరిశీలిస్తున్న సీఈవో నారాయణమూర్తి

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి పార్కులో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. బుధవారం పార్కును సందర్శించి అల్లూరి, గంటందొరల సమాధులకు, విగ్రహాలకు నివాళులర్పించారు. అనంతరం పార్కులోని కళామందిరంలో అల్లూరి జీవిత చరిత్ర చిత్రపటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ పర్యాటకులకు తాగునీటి సౌకర్యం కల్పించడానికి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తామన్నారు. వేసవిలో జిల్లా వ్యాప్తంగా తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. లింగంపేట, ఏటిగైరంపేట తాగునీటి పథకాలకు గత ఏడాది రూ.28 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజ్, ఈవోపీఆర్డీ కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత లేకుండా చర్యలు

గొలుగొండ: ఉమ్మడి జిల్లాలో గల మండలపరిషత్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్టు జడ్పీ సీఈవో నారాయణమూర్తి తెలిపారు. బుధవారం మండలంలోని ఏటిగైరంపేట, చోద్యం గ్రామాల్లో గల భారీ తాగునీటి పథకాల పని తీరును పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో మాట్లాడిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో 45 భారీ తాగునీటి పథకాలు ఉన్నాయన్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో మార్చి నెలలో ఎన్నికల కోడ్ రద్దయిన వెంటనే సిబ్బందిని సర్దుబాటు చేస్తామని చెప్పారు. అలాగే వచ్చే వేసవికి తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. గొలుగొండ మండల పరిషత్ కార్యాలయ మరమ్మతులకు మండల పరిషత్ సాధారణ నిధుల నుంచి ప్రస్తుతం పనులు జరుగుతున్నాయన్నారు. ఆ నిధులు సరిపడకపోతే జిల్లా పరిషత్ సాధారణ నిధులు మంజూరు చేస్తామన్నారు. అలాగే హైస్కూల్లో అసంపూర్తి పనులను గుర్తించి ఆ పనులు పూర్తి చేసేందుకుగాను ప్రతిపాదనలు సిద్ధం చేస్తే జడ్పీ సాధారణ నిధుల నుంచి నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మేరీరోజీ, వ్యవసాయాధికారిని సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్ల పరిశీలన


దివ్యాంగుల సదరం సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న వైద్యులు

కె.కోటపాడు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సదరం పెన్షన్లలో భాగంగా అవకతవకలు జరిగాయన్న ఉద్దేశంతో ప్రభుత్వం సంబంధిత వైద్యులతో పునఃపరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ నేపథ్యంలో కె.కోటపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలో బుధవారం సదరం క్యాంప్ నిర్వహించారు. ధ్రువపత్రాల ఆధారంగా పెన్షన్ పొందుతున్న వారిని కేజీహెచ్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన వైద్యులు తనిఖీ చేశారు. మండలంలో 459 మందికి దివ్యాంగ పెన్షన్‌దారులు ఉండగా, మొదటి రోజు చౌడువాడ ఒకటి, కొరువాడ సచివాలయ పరిధిలో ఉన్న 61 మంది రావాల్సి ఉండగా, ఒక వ్యక్తి మరణించగా 58 మంది హాజరయ్యా రు. కేజీహెచ్ వైద్యులు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రోహిత్‌లు ఈ పరిశీలనలో పాల్గొనగా, స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ శ్రీలక్ష్మి, ఎంపీడీవో సాంబశివరావు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్ ప్రతులు దహనం

చోడవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రైతులకు కేంద్ర బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపారని ఆరోపిస్తూ బుధవారం ఏపీ రైతు సంఘం కార్యకర్తలు బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విస్సారపు నాగూరు, శనివాడ శ్రీనివాసరావు, గణేశ్ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లిలో..

దేవరాపల్లి: కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేసి ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, బి.టి.దొర, ఎర్రునాయుడు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

» విద్యుత్ తీగను తెంపేసిన చెరకు లారీ
» తీగ తెగి విద్యుదాఘాతానికి గురైన వాహనచోదకుడు


ప్రమాదానికి గురైన వాహనం, పక్కన గాయపడిన లక్ష్మీరావు

మాడుగుల రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : భారీ ఎత్తుగా చెరకు లోడుతో వెళుతున్న చెరకు లారీ విద్యుత్ తీగను తెంపేయడంతో ఆ తీగ వెనుక వస్తున్న వాహనచోదకుడిపై పడి గాయపడ్డాడు. అయితే ప్రాణాపాయం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని ఎంకెవల్లాపురం చెరకు కాటా(ఘాట్‌రోడ్డు చెరకు కాటా)లో లారీలో చెరకు లోడింగ్ చేసుకుని గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి బుధవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో తీసుకెళుతున్నారు. కాటా నుంచి సుమారు కిలో మీటరు దూరంలోని ఎం.కోటపాడు గ్రామానికి చేరుకుంటున్న తరుణంలో లారీపై ఎత్తుగా కట్టి తీసుకెళుతున్న చెరకు గడలకు విద్యుత్ తీగ తగిలి తెగి వేలాడుతూ ఆ చెరకు లారీ వెనుక ద్విచక్ర వాహనంపై వస్తున్న ఎం.కోటపాడు గ్రామానికి చెందిన ద్వారపూడి లక్ష్మీరావు (55)ను తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. కింద పడే సమయంలో వాహనాన్ని వదిలేయడంతో ప్రాణాపాయం తప్పింది. ఎం.కోటపాడు ఉప సర్పంచ్ శానాపతి గంగాధర్ వెంటనే స్థానిక లైన్‌మన్‌కి సమాచారం అందించి విద్యుత్ సరఫరాను ఆపించారు. గాయపడిన లక్ష్మీరావుకి ప్రథమ చికిత్స చేయించారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

కృష్ణాదేవిపేట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో గురువారం నుంచి మూడు రోజులపాటు జరిగే 22వ ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర సమితి సభ్యుడు జి.రాధాకృష్ణ కోరారు. బుధవారం గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు మేకా భాస్కరరావు, భరత్‌కుమార్, బ్రహ్మాజీ, మురళి, శివ, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సీనియర్ అసిస్టెంట్ నిరసన

» ఏడాదిగా తనకు జీతం రావడం లేదని ఆవేదన


నిరసన తెలుపుతున్న సీనియర్ అసిస్టెంట్ సముద్రం

మాడుగుల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మాడుగుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ మైలపిల్లి సముద్రం బుధవారం కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. తనకు ఏడాది కాలంగా జీతం అందక ఇబ్బందులు పడుతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పదవీ విరమణ పొందేందుకు ఎన్నో రోజులు లేకపోయినప్పటికీ కావాలనే కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ తన జీతాలు నిలుపుదల చేసేలా సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో తన పేరు తప్పించారని ఆరోపించారు. ఈ విషయమై సబ్ రిజిస్ట్రార్ పురుషోత్తంను వివరణ కోరగా సీనియర్ అసిస్టెంట్ సముద్రం జీతం నిలుపుదల విషయంలో తన ప్రమేయం లేదన్నారు. 2024 జనవరి 27 నుంచి ఏప్రిల్ 23 వరకు తాను సెలవుపై వెళ్లానని, ఆ నాలుగు నెలలు సీనియర్ అసిస్టెంట్ సముద్రం ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేశారని తెలిపారు. ఆ సమయం ఫిబ్రవరిలో సీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో సముద్రం పేరు తొలగిందని చెప్పారు. ఈ విషయాన్ని ఇప్పటికే పలుమార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లానని ఆయన తెలిపారు.

నేరేడు బంద వాసులకు తప్పని డోలీ మోత


గాయపడిన వ్యక్తిని డోలీలో తీసుకువెళుతున్న నేరేడు బంద గ్రామస్థులు

రావికమతం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రహదారి సౌకర్యం లేక డోలీ మోతలు తప్పడం లేదని మండలంలోని నేరేడు బంద గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం జీకే వీధి మండలం పెద్దవలస పంచాయతీ శివారు పెద్దలంక గ్రామానికి చెందిన మర్రి బాబూరావు నేరేడు బందలోని అత్తవారింటికి బయలుదేరాడు. కొండ ఎక్కుతున్న క్రమంలో కాలుజారి పడిపోయాడు. దీంతో కాలికి గాయమై నడవలేక ఉండిపోయాడు. ఈ విషయం అత్తవారికి తెలిసి గ్రామస్థుల సహాయంతో డోలీ కట్టి బాబూరావును నేరేడు బంద తీసుకువెళ్లారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం ఉంటే డోలీ మోతలు తప్పేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉత్సాహంగా చిత్రలేఖనం పోటీలు

మాకవరపాలెం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మాకవరపాలెం, తామరం, రాచపల్లి, కస్తూర్బా గాంధీ పాఠశాలలతో పాటు మరికొన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఉగాది రోజున బహుమతులు అందజేస్తామని ప్రధానోపాధ్యాయుడు అచ్యుతరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగరాజు, శేషగిరిరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి కలెక్టర్ ఆర్థిక సాయం



లోహిత్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): డుంబ్రిగుడ మండలం గేదెలబంద గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి, అథ్లెటిక్ క్రీడాకారుడు చెట్టి లోహిత్‌కు జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ రూ.20 వేలు ఆర్థిక సాయం చేశారు. లోహిత్ ఈనెల 9న విజయవాడలో జరుగుతున్న జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనడానికి వెళ్లేందుకు గానూ కలెక్టర్ ఈ ఆర్థిక సాయాన్ని అందించారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో సంవత్సరం చదువు కొనసాగిస్తూ ఇప్పటి వరకు రాష్ట్ర, జాతీయ స్థాయి పరుగుల పోటీల్లో పాల్గొని 35 గోల్డ్ మెడల్స్ సాధించానని లోహిత్ కలెక్టర్‌కు తెలిపారు. తన కుమారుడికి సాయం చేసినందుకు క్రీడాకారుడు తండ్రి సంజీవ్ జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

జలాశయంలో మరో బాలుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువస్తున్న దృశ్యం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోలాపుట్టు జలాశయంలో మరో బాలుడు మృతదేహం లభ్యమైంది. జలాశయంలో గత శనివారం నాటుపడవ మునిగి ఇద్దరు బాలురు గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం ఒక బాలుడు మృతదేహాన్ని ఒడిశా ఓడీఆర్ఎఫ్ సహాయక బృందా లు వెలికితీసి బాధిత కుటుం బ సభ్యులకు అప్పగించారు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఓడీఆర్ఎఫ్ బృందాలు గాలింపులకు సిద్ధం అవుతుండగా జలాశయంలో శివ హంతాల్(15) మృతదేహం తేలాడుతూ కనిపించింది. దీంతో సహాయక బృందాలు జలాశయంలోకి వెళ్లి ఆ మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. బాలుడు మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు పార్వతి, సురేంద్రలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒడిశా రెడ్‌క్రాస్ సంస్థ శివ కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందించింది. జలాశయంలో గల్లంతైన ఇద్దరు బాలుర ఆచూకీ కోసం గత ఐదు రోజులుగా శ్రమించిన ఒడిశా ఓడీఆర్ఎఫ్ బృందాలకు, నందపూర్ అగ్నిమాపక సిబ్బందికి బాధిత కుటుంబసభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

బొంగరం బస్సు వేళలు మార్చాలని ఆర్టీసీ డీఎంకు వినతి



ఆర్టీసీ డీఎం ఉమామహేష్ రెడ్డితో మాట్లాడుతున్న స్థానికులు

పెదబయలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాడేరు నుంచి వయా పెదబయలు బొండాపల్లి, గోమంగి, లింగేటి పంచాయతీల మీదుగా బొంగరం వరకు నడుపుతున్న ఆర్ టీసీ బస్సు సర్వీసు వేళలను మార్చాలని పలువురు కోరుతున్నారు. బుధవారం రోడ్డు పరిశీలనకు వచ్చిన పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉమామహేష్ రెడ్డికి తెలుగుయువత అరకు నియోజకవర్గ అధికార ప్రతినిధి కొర్ర శేషగిరిబాబు ఆధ్వర్యంలో ప్రజలు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొంగరం బస్సుపై ఆధారపడి ఏడు పంచాయతీల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. కొన్ని సార్లు బస్సు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రతి రోజూ బస్సు నడిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్యాహ్నం మూడు గంటలలోపు కాకుండా నాలుగు గంటల తర్వాత బొంగరం బస్సు రిటర్న్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించారు. బస్సు సర్వీసు రోజూ తిరిగేలా చర్యలు తీసుకుంటానని, మధ్యాహ్న సమయం మార్పు చేస్తానని హామీ ఇచ్చారు.

ఆటో బోల్తా : ఆరుగురికి తీవ్ర గాయాలు

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించుమండలో బుధవారం సాయంత్రం అడ్డంగా ఆవు రావడంతో ఆటో బోల్తా పడి ఆరుగురు చిరు వ్యాపారులు గాయపడ్డారు. పోతంగి పంచాయతీ పనసపుట్టు గ్రామానికి చెందిన గిరిజనులు బుధవారం జరిగిన సంతకు వెళ్లారు. గాజులు వ్యాపారం చేసుకుంటున్న బాధిత గిరిజనులు తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి చేరుకునేందుకు ఆటోను ఎక్కారు. కించుమండ సమీపంలో జాతీయ రహదారిపై అడ్డంగా వచ్చిన ఆవును ఢీకొని ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న చిరు వ్యాపారులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ప్రైవేటు వాహనాల్లో ఆస్పత్రికి తరలించారు. ఆటో ప్రమాదంలో గొల్లోరి త్రినాథ్‌కు ఎడమ కాళ్లు విరిగిపోయింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం



సాలాపు మాధవి

పాడేరురూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళ అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక సీఐ డి.దీనబంధు తెలిపారు. పాడేరు గుడివాడ కాలనీకి చెందిన సాలాపు కోటిబాబు కుమార్తె సాలాపు మాధవి(37) అనే మతిస్థిమితం లేక గత నెల 6వ తేదీ ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇంట వెతికినా కానరాలేదన్నారు. ఈనెల ఐదో తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఆచూకీ తెలిసినవారు 9440904231కి సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

పీఎం ఇంటర్‌షిప్‌పై అవగాహన కల్పించండి : ఎంపీడీవో

అనంతగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో పదో తరగతి, ఇంటర్ పాసై, ఖాళీగా ఉంటున్న యువతీ,యువకులకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంటర్‌షిప్ ప్రవేశపెట్టిందని ఎంపీడీవో ఏవీవీ.కుమార్ బుధవారం తెలిపారు.దీనిపై కార్యదర్శులు పంచాయతీ పరిధిలో అవగాహన కల్పించాలన్నారు. 21 నుంచి 24 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు ఇంటర్‌షిప్ వెబ్‌సైట్‌లో వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని. నెలకు రూ.5వేల స్టైఫండ్ కింద అందజేస్తారని, ఆసక్తిని అనుసరించి శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు తెలిపారు.

రెండు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాడేరు, జి.మాడుగుల విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో 7వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏపీఎస్ఎం.అప్పారావు తెలిపారు. పాడేరు సబ్‌స్టేషన్ పరిధిలో బర్సింగి, ఇరడాపల్లి, కించూరు, డోకులూరు, వంజంగి గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. జి.మాడుగుల సబ్‌స్టేషన్ పరిధిలో కొక్కిరాపల్లి, పాలమామిడి, గెమ్మెలి, వంజరి, లువ్వాసింగిలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

నులిపురుగుల దినోత్సవం విజయవంతం చేయాలి : కలెక్టర్



నులిపురుగుల దినోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 10న నిర్వహించే జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జాతీయ నులిపురుగుల దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ అనంతరం అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 3 లక్షల 35 మందికి డీ వార్మింగ్ (ఆల్బెండజోల్)మాత్రలు వేయాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. అందుకు గానూ 3లక్షల 68 వేల మాత్రలను విద్యా సంస్థలకు పంపిణీ చేస్తామన్నారు. అలాగే 10న జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా 19 ఏళ్ల వయస్సు లోపున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను వేయించాలని కలెక్టర్ సూచించారు. ఆరోజు మాత్రలు వేసుకోని వారుంటే 17న విధిగా వేయించాలని సూచించారు. ఈకార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ కె.కృష్ణారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ఎంపీడీవోలు, ఐసీడీఎస్, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంను కలిసిన సర్పంచులు



ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో బుధవారం తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటరీ నియోజకవర్గ సమావేశం ఎమ్మెల్యే మిరియా శిరీష అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి హాజరైన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆధ్వర్యంలో పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాల సర్పంచులు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరబత్తుల రాజశేఖరంను శాలువతో సత్కరించారు. కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు బాకూరు వెంకటరమణరాజు, పి.పాండు రంగ స్వామి, పి.వశిభూషణ్ నాయుడు, సాగర సుబ్బారావు, సూర్యకాంతం, ఎంపీటీసీ సభ్యురాలు కొమ్మ రమ, టీడీపీ నేతలు సుబ్బారావు, బుజ్జిబాబు, జోగులు, సుందరరావు, దొన్ను, శివసాగర్ స్వామి, ధార రవి, తిరుపతి, మండ్యాగురు స్వామి తదితరులు పాల్గొన్నారు.

బాల్య ప్రభ దీక్షకు ఎస్టీ కమిషన్ చైర్మన్ మద్దతు



హుకుంపేటలో గిరిజన మహిళ దీక్షలో బాధితులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకర్‌రావు, కమిషన్ సభ్యురాలు లిల్లి

హుకుంపేట ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):బినామీ పేర్లతో ఆదివాసీల భూములను కొనుగోలు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని గంపరాయి బాల్యప్రభ చేస్తున్న దీక్షకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు, కమిషన్ సభ్యురాలు లిల్లి, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి. కృష్ణారావు బుధవారం మద్దతు తెలిపారు. దీక్షా శిబిరానికి వెళ్లి ఆమె సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు మాట్లాడుతూ బాల్య ప్రభ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారావు మాట్లాడుతూ భూముల క్రయవిక్రయాలపై గతంలోనే గిరిజన సంఘం ఆందోళనలు చేసిందన్నారు. రెవెన్యూ అధికారులు, స్థానిక గిరిజనులు, మధ్యవర్తులు కుమ్మక్కు అయి భూముల విక్రయాలు, అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. తనకు న్యాయం జరిగే వరకు దీక్ష విరమించేది లేదని బాధితురాలు బాల్య ప్రభ తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నేతలు పాల్గొన్నారు.



డుంబ్రిగుడ: బాధితుల నుంచి వినతిపత్రాన్ని తీసుకుంటున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు

భూములిచ్చిన బాధితులకు అండగా ఉంటాం

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయానికి సాగు భూములు ఇచ్చిన బాధితులకు ఉపాధి కల్పించేంతవరకు ఎస్టీ కమిషన్ అండగా ఉంటుందని ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు స్పష్టం చేశారు. మండల కేంద్రంలో బాధిత గిరిజనులు చేపడుతున్న ఆందోళన దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత గిరిజనులు ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావు మాట్లాడుతూ సాగు భూములిచ్చి ఏడేళ్లుగా బాధిత గిరిజనులు మొర పెట్టుకున్నా ఉపాధి కల్పించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. బాధితులకు ఉపాధి కల్పించేలా కలెక్టర్, కమిషనర్‌కు నివేదికను అందిస్తామన్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి శాంత కుమారి బాధితులతో రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. బాధితులకు సీపీఎం మండల కార్యదర్శి పోతురాజు సంఘీభావం ప్రకటించారు.

ధారమఠం మహాశివరాత్రి వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయాలి

- సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్



మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్, అధికారులు

హుకుంపేట ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ధారమఠం మత్స్యలింగేశ్వస్వామి మహాశివరాత్రి వేడుకలకు అధికారుల కమిటీ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ ఆదేశించారు. బుధవారం మండలంలోని ధారమఠం మత్స్యలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గడ్డ వద్ద వెలసిన మత్స్యదేవతలను చూసి ఆశ్చర్య చకితులయ్యారు. అనంతరం ఆలయ పరిసరాలు పరిశీలించారు ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సబ్‌కలెక్టర్‌ను శాలువతో సత్కరించారు. అనంతరం సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ మహాశివరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ స్థలాలు, క్యూ లైన్లు సక్రమంగా ఉండాలన్నారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖ, ఆర్టీసీ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాద స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్సవాలు మూడు రోజులు భద్రత పక్కాగా ఉండాలని సీఐ నాయుడుకు సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్ సూచించారు. ఆయన వెంట ఆర్ఐ సీతమ్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పారావు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గోపాల్ పాత్రుడు, ప్రధాన కార్యదర్శి మత్య కొండబాబు, కార్యదర్శి ఆనంద్, బాలయ్య హరినాథ్ సింహాచలం, సచివాలయ సిబ్బంది శివకృష్ణ, విజయవేణి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని సీఐటీయూ ఆందోళన



పాడేరులో లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని ఐటీడీఏ వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లు ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఐటీడీఏ వద్ద బుధవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు ఎన్నో పోరాటాలను చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం అన్యాయమన్నారు. ఈ చట్టాలను ఎప్పుడైనా అమలుకు ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రీ బడ్జెట్ సమావేశంలో కార్మిక సంఘాల నేతల సమావేశంలో ప్రకటించగా వారంతా వ్యతిరేకించారన్నారు. అందులో భాగంగానే దేశవ్యాప్తంగా చేపడుతున్న నిరసనలో భాగంగా ఇక్కడ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి లింగేటి సుందరరావు మాట్లాడుతూ ఉన్న హక్కులను కాలరాస్తే కార్మిక వర్గం చూస్తూ కూర్చోదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ముత్యాలమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సీలేరులో సీఐటీయూ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు

సీలేరులో.

సీలేరు సీఐటీయూ కార్యాలయం ఎదుట బుధవారం ఏపీ జెన్‌కో కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. కార్మిక సంస్కరణల పేరిట ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌లుగా రూపొందించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ గౌరవాధ్యక్షుడు ఎస్‌కే సుభాన్ తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ హెచ్ 176 సీలేరు బ్రాంచి అధ్యక్షుడు బి. లక్ష్మణ్, కార్యదర్శి టి. విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి : డీఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ షాబాద్ అహ్మద్

పాడేరురూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై గిరిజనులకు మహిళా పోలీసులు అవగాహన కల్పించాలని పాడేరు డీఎస్పీ షేక్ షాబాద్ అహ్మద్ సూచించారు. బుధవారం ఆయన హుకుంపేట మండలానికి చెందిన మహిళా పోలీసులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి సాగు చేపట్టినా.. రవాణాకు సహకరించినా.. చట్టరీత్యా కలిగే ఇబ్బందులను ప్రజలకు వివరించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో జూదం, మద్యం బెల్టుషాపుల నిర్వహణ, సారా అమ్మకాలు చేపట్టినా.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా.. వెంటనే సమీప పోలీసు స్టేషన్‌లకు సమాచారాన్ని అందించాలన్నారు. సైబర్ నేరాలు, ట్రాఫిక్‌పై అవగాహన, గృహహింస నేరాలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. శాంతిభద్రతలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే ముందస్తుగా తెలియజేయాలని ఆదేశించారు. సమావేశంలో పాడేరు సీఐ డి.దీనబంధు, హుకుంపేట సీఐ ఎస్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పెదబయలు ఆశ్రమ పాఠశాల-1కు హరిత విద్యాలయం అవార్డు



అవార్డును అందుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, క్లస్టర్ కో-ఆర్డినేటర్ బాలకృష్ణ

పెదబయలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన హరిత విద్యాలయాల రేటింగ్స్‌లో పెదబయలు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల -1 జాతీయ స్థాయిలో ఎంపికైందని ప్రధానోపాధ్యాయుడు టి. నాగేశ్వరరావు, ఎన్జీసీ క్లస్టర్ కో-ఆర్డినేటర్ చెండా బాలకృష్ణ తెలిపారు. ఇండియన్ హాబిటేషన్స్ సెంటర్ ఆడిటోరియంలో ప్రముఖ పర్యావరణవేత్త పద్మశ్రీ సునీత నారాయణ, ఇన్నోవేటర్, రామన్ మెగాసేగ్రహిత సోనం వాన్చుక్ చేతుల మీదగా అవార్డును అందుకున్నామని వారు చెప్పారు. పాఠశాలలో నీటి సంరక్షణ, జీవవైవిధ్యం, పరిశుభ్రత, ఎనర్జీ కన్జర్వేషన్ పలు పర్యావరణహిత కార్యక్రమాలపై అవగాహన కల్పించడం, వివిధ రకాల ఔషధ మొక్కల పెంపకం, ఎకో గ్రూపులను ఏర్పాటు చేసినందుకు తమ పాఠశాలకు హరిత విద్యాలయం అవార్డు వరించిందన్నారు.

ఎలుగుబంటి దాడి బాధితులకు చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులను పంపిణీ చేసిన సందీప్ రెడ్డి

డుంబ్రిగుడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటగన్నేల పంచాయతీ గుంటసీమ అటవీ సెక్షన్ పరిధిలోని పిత్తగుడ ఎలుగుబంటి దాడి బాధితులకు పాడేరు డివిజన్ అటవీ శాఖ అధికారి వెంకట్ సందీప్ రెడ్డి పరిహారం చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. పాడేరు అటవీశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కిల్లో లక్ష్మి, కిల్లో కేశ్వరరావు, వలజంగి సీతలకు పరిహారం చెక్కులను అందజేశారు. వీరు కాఫీ తోటల్లో పనులకు వెళ్లగా ఎలుగుబంటి దాడి చేసి గాయపరిచింది. దీంతో వారు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. దీనిపై అటవీశాఖ అధికారులు విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక పంపారు. దీంతో కిల్లో లక్ష్మికి రూ.2లక్షలు, కిల్లో కేశ్వరరావుకు రూ.2లక్షలు, వలజంగి సీతకు రూ.20వేల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటసీమ ఫారెస్ట్ సెక్షన్ అధికారి అప్పన్న, సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : డీఎల్‌పీవో



రాజేంద్రపాలెంలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్‌పీవో కుమార్

కొయ్యూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శాసన మండలికి సంబంధించి ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీవో పీఎస్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో ఎస్‌కేవీ ప్రసాద్‌తో కలిసి రాజేంద్రపాలెం, కొయ్యూరు సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రాజేంద్రపాలెం సంపద కేంద్రాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పన్నుల వసూళ్లపై సమీక్షించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ ఫిబ్రవరి 27న జరగనున్న శాసనమండలి ఎన్నికలకు ఎన్నికల నియామవళి అమలులోకి వచ్చిందన్నారు. నియామవళిని అతిక్రమించే వారిపై నిబంధనల మేరకు చర్యలు తప్పవన్నారు.

15 నుంచి వినియోగంలోకి సంపద కేంద్రాలు : ఎంపీడీవో

గూడెంకొత్తవీధి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్న సంపద కేంద్రాలు ఈనెల 15వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొస్తామని స్థానిక ఎంపీడీవో వై.ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం మండలంలోని సంకాడ, రింతాడ, లక్కవరపుపేట సంపద కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మండలంలో 16 పంచాయతీల్లో 13పంచాయతీల్లో సంపద కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అమ్మవారి ధారకొండలో సంపద కేంద్రం నిర్మాణం ఇప్పటివరకు ప్రారంభం కాలేదన్నారు. లక్కవరపుపేట, ధారకొండ సంపద కేంద్రాలను 10 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీచేశామన్నారు. 15 సంపద కేంద్రాలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్టు, కంపోస్టు ఎరువులను తయారు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీచేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ పాపారావు పాల్గొన్నారు.

అనుమతులతోనే బస్‌షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణాలు

- సీలేరు సర్పంచ్ దుర్జో, కాంగ్రెస్, వైసీపీ నేతలు

సీలేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అన్ని అనుమతులతోనే బస్ షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని సీలేరు సర్పంచ్ పాంగి దుర్జో, స్థానిక కాంగ్రెస్, వైసీపీ నాయకులు స్పష్టం చేశారు. బుధవారం వారు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ అనుమతులు, తీర్మానాలు లేకుండా బస్ షెల్టర్, మరుగుదొడ్లు కడుతున్నారంటూ స్థానిక కూటమి నాయకులు చిటికెల రాము, వనముల రాము, ఓడూరు గోవింద్, జాగరపు బాలకృష్ణ చేసిన ప్రకటనలను వారు ఖండించారు. ఈ సందర్భంగా అన్ని అనుమతి పత్రాలను వారు విలేకర్ల సమావేశంలో ప్రదర్శించారు. గ్రామాభివృద్ధికి కట్టుబడి కాంగ్రెస్ పార్టీ సపోర్టు చేసిందని జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి కారే శ్రీనివాస్ తెలిపారు. ఈ నిర్మాణాలపై ఎవరికైనా అనుమానాలు ఉంటే స్వయంగా పంచాయతీ కార్యాలయానికి స్వయంగా వచ్చి పరిశీలించుకోవచ్చునని సర్పంచ్ దుర్జో తెలిపారు. విలేకర్ల సమావేశంలో కాంగ్రెస్ నేతలు వానపల్లి అప్పారావు, ఎం సత్తిబాబు, వైసీపీ నాయకులు వెంకటరావు, పి. సత్యనారాయణ, సీఐటీయూసీ గౌరవాధ్యక్షుడు ఎస్. సుభాన్ తదితర్లు పాల్గొన్నారు.

'ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిని విడుదల చేయాలి'



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

పాడేరురూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరిన ఏఐఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మాధవ్‌ను అక్రమంగా అరెస్టు చేసిన పోలీసులు తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజశేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా సమ్మెపల్లిలో ఈనెల 1వ తేదీన జరిగిన చంద్రబాబు బహిరంగ సభలో అరెస్టు చేసిన మాధవ్‌ను విడుదల చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ సహాయ కార్యదర్శి తనీష్ పాల్గొన్నారు.

ఊడేరు... మురుగుతో బేజారు!



ఊడేరు ప్రధాన రహదారి పక్కనే పేరుకుపోయిన మురుగు

- గ్రామంలో లోపించిన పారిశుధ్యం.. దోమలు, ఈగల స్వైరవిహారం
- డ్రైనేజీలు లేక ఎక్కడికక్కడే స్తంభిస్తున్న మురుగు నీటి నిల్వలు
- పట్టించుకోని అధికార గణం.. రోగాల భయంతో వణుకుతున్న జనం

తుమ్మపాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలంలోని ఊడేరు గ్రామంలో మురుగు తిష్ఠ వేసింది. ఏ మూల చూసినా పారిశుధ్య లోపం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఎక్కడికక్కడే చెత్త వాతావరణం దర్శనమిస్తోంది. డ్రైనేజీలు లేక రోడ్లపైనే వాడుకనీరు ఏరులై పారుతోంది. మరుగు నీటి నిల్వలను దోమలు, ఈగలకు ఆవాసాలు మారిపోతున్నాయి. ఈ సమస్యను అధికారులు, పాలకులు పట్టించుకునే పాపానికి పోకపోవడంతో ప్రజలు రోగాల భయంతో వణుకుతున్నారు.

ఊడేరు పంచాయతీ పరిధిలో సుమారు 1500 మంది జనాభా నివాసం ఉంటున్నారు. వీరంతా డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లో వాడుకనీరు రోడ్లపైకి విడిచిపెడుతున్నారు. దీంతో రోడ్లన్నీ మురుగుమయంగా దర్శనమిస్తున్నాయి. రోజుల తరబడి మురుగు నిలిచిపోతుండడంతో విషపూరితమైన దోమలు ప్రబలి గ్రామస్థులను అనారోగ్యాలకు గురి చేస్తున్నాయి.

సొంతిల్లు ఉన్న వారు మాత్రం వాడుకనీటిని తరలించేందుకు ఇంటికి దూరంగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక గ్రామంలో ఏ శుభకార్యం జరిగినా ఆ ప్రాంతమంతా మురుగుమయంగా మారిపోతుంది. రహదారులపైనే పలు కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో వాడుక నీరు ప్రవహించే అవకాశం లేక రోజుల తరబడి మురుగు నిలిచిపోతోంది. ఈ మురుగు నుంచి భరించలేని దుర్వాసన వెదజల్లుతూ ఇళ్లల్లో ఉండలేని దుస్థితి దాపురిస్తోంది. దీనికితోడు నిలిచిపోయిన మురుగులో విషపూరితమైన దోమలు ప్రబలుతున్నాయి. గ్రామస్థుల మీద రాత్రి వేళల్లో దండయాత్రకు దిగి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

అలాగే విషపూరితమైన దోమల బారిన పడి పలువురు జ్వరాలతో ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ఏళ్ల తరబడి గ్రామంలో డ్రైనేజీ సమస్య ఉన్నప్పటికీ ప్రజా ప్రతినిధులుగాని, సంబంధిత అధికారులుగాని పట్టించుకోకపోవడంపై గ్రామస్థులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే చొరవ చూపించి గ్రామంలో డ్రైనేజీలను నిర్మించాలని, మురుగు సమస్యకు ముగింపు పలకాలని వారు కోరుకుంటున్నారు.





వాడుక నీటి కోసం నివాసితులు ఏర్పాటు చేసుకున్న ఇంకుడు గుంతలు



డ్రైనేజీ సదుపాయం లేకుండా రోడ్డు మాత్రమే ఉన్న ఊడేరులోని ఒక వీధి

చీకటి పడిందంటే దోమలు దండయాత్ర చేస్తున్నాయి

-బొబ్బిలి లక్ష్మి, ఊడేరు గ్రామం



గ్రామంలో డ్రైనేజీలు లేక ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది. దీంతో ఆ మురుగులో దోమలు ఉత్పత్తి కేంద్రంగా మలుచుకొని గ్రామస్థులపై దండయాత్ర చేస్తున్నాయి. దోమల వల్ల రాత్రి వేళల్లో కంటి మీద కునుకు లేకుండా పోతుంది. ప్రమాదకరమైన దోమలు కుట్టిన సందర్భంలో పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. అలాగే ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వాడుకుంటున్నాం. పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి గ్రామంలో తక్షణమే డ్రైనేజీలు ఏర్పాటు చేయాలి.



ఊడేరు మెయిన్ రోడ్డుపై రోత పుట్టిస్తున్న మురుగు

ఇంటర్వ్యూ..

మత్తు పదార్థాల రవాణాపై ప్రత్యేక నిఘా

-డి.అనిల్‌కుమార్, ఎక్సైజ్ సీఐ



సర్కిల్ పరిధిలో మద్యం బెల్టు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం వస్తే ముందస్తుగా కేసులు నమోదు చేస్తున్నాం. ప్రతీ గ్రామంలో పెద్దలతో సమావేశమై బెల్టు దుకాణాల కోసం వేలం పాటలు జరగకుండా అవగాహన కల్పిస్తున్నాం. నాటుసారా రవాణా నిరోధానికి ప్రభుత్వం 14405 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేసింది. దీన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నాం.

ప్రశ్న: సబ్బవరం ఎక్సైజ్ శాఖ పరిధిలో ఎన్ని మద్య దుకాణాలు, బార్లు ఏర్పాటు చేశారు?

జవాబు: సబ్బవరం సర్కిల్ పరిధిలో సబ్బవరం, పరవాడ మండాలు ఉన్నాయి. సబ్బవరంలో ఎనిమిది, పరవాడలో 14 మద్య దుకాణాలు రెండు బార్లు ఉన్నాయి.

ప్ర: గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు ఏర్పాటును అడ్డుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: సర్కిల్ పరిధిలో ఎటువంటి మద్యం బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయలేదు. ఒకవేళ ఎక్కడైనా ఏర్పాటు చేస్తున్నట్టు సమాచారం వస్తే ముందస్తుగా కేసులు నమోదు చేస్తున్నాం. ప్రతీ గ్రామంలో పెద్దలతో సమావేశమై మద్యం బెల్టు దుకాణాల కోసం వేలం పాటలు జరగకుండా అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: నాటుసారా, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?

జ: నాటుసారా రవాణా నిరోధానికి ప్రభుత్వం 14405 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేసింది. దీన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్తున్నాం. పరవాడ మండలంలోని తిక్కవానిపాలెం, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లో ఎక్కడో నాటుసారా తయారు చేసి ఇక్కడ విక్రయిస్తుంటారు. ఈ రెండు గ్రామాల్లో నిఘాతో పాటు ఎప్పటికప్పుడు అవగాహన సదస్సులు పెడుతున్నాం.

ప్ర: గంజాయి రవాణా/వినియోగాన్ని అడ్డుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: వారంలో రెండు, మూడు రోజులు వాహనాల తనిఖీ చేస్తున్నాం. అనుమానాస్పద వాహనాలపై నిఘా పెట్టి ప్రత్యేకంగా, ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నాం.

-సబ్బవరం, ఆంధ్రజ్యోతి

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

- జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అవగాహనతో ప్రమాదాలను నివారించుకోవచ్చని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో ద్విచక్ర వాహన చోదకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో గాలి, దుమ్ము నుంచి రక్షించడంతో పాటు సురక్షిత ప్రయాణాన్ని హెల్మెట్లు అందిస్తాయన్నారు. వాహన తనిఖీలు చేపట్టి వాహనదారులకు రహదారి భద్రతా, మోటార్ వాహన చట్టం గురించి అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాదాలను నియంత్రించడంలో భాగంగా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. డ్రంకెన్ డ్రైవ్ చేసిన వారిపై కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అలాగే ఎంవీ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హెటిరో డ్రగ్స్ ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం కోరారు. విశాఖ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను బుధవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రతా ప్రమాణాలు పాటించడంలో ఫార్మా కంపెనీలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి ప్రమాదానికి కారణమైన హెటిరో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు.

30 మద్యం సీసాలు పట్టివేత

కశింకోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గవరపేట గ్రామానికి చెందిన మద్దాల నూకరాజు వద్ద 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ సూర్యారావు బుధవారం తెలిపారు. గ్రామంలో ఉన్న పాన్ షాపులో మద్యం విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామని చెప్పారు. ఈ మేరకు షాపులో తెల్లని గోనె సంచిలో ఉన్న 30 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు

12 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం పిసినికాడ పంచాయతీలో బెల్టుషాపులో 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, ఒకరిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్‌ఐ జి.రవికుమార్ తెలిపారు. బుధవారం తమకు వచ్చిన సమాచారం మేరకు సిబ్బంది వెళ్లి దాడి చేయగా పీలా వీరునాయుడు పాన్‌షాపులో మద్యం అమ్ముతున్నాడని గుర్తించామని, 12 క్వార్టర్ బాటిళ్లు లభ్యమయ్యాయమని చెప్పారు. ఈ మేరకు నిర్వాహకుడు వీరునాయుడుపైకేసు నమోదు చేసినట్టు చెప్పారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చోడవరం బస్టాప్ వద్ద మద్యం బాటిల్స్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిపై బుధవారం కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపారు. అనకాపల్లి ప్రాంతానికి చెందిన కె.దుర్గారావు పది మద్యం బాటిళ్లతో వెళ్తుండగా అనుమానం వచ్చి చోడవరం బస్టాప్ వద్ద తనిఖీ చేయగా బయటపడ్డాయన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

మార్చి 2న భావ నారాయణ కల్యాణం

- కరపత్రాలు ఆవిష్కరించిన ఎమ్మెల్యే కొణతాల



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో మార్చి 2వ తేదీన భద్రావతి సమేత భావ నారాయణ స్వామి కల్యాణం జరగనుంది. ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సామాజికవర్గ ప్రతినిధులు పప్పు రాజారావు, సూరిశెట్టి సూరిబాబు, పంపాన సత్యనారాయణ, దొడ్డి ఈశ్వరరావు, తిప్పాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మ విద్వేశ్వరీ అలంకరణలో శ్యామా అమ్మవారు



సబ్బవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవీపురం రాజరాజేశ్వరీ దేవీ సహస్రాక్షి అమ్మవారి పీఠంలో శ్యామా అమ్మవారు నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం బ్రహ్మ విద్వేశ్వరీ రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా నకుల శ్యామా అర్చన, బ్రహ్మ విద్వేశ్వరీ సహిత నకులి శ్యామా హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ ఊరేగింపు వైభవంగా జరిగింది. విద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం

సబ్బవరం: మండలంలోని నారపాడు గ్రామంలో సీతారామల తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి సీతారాములకు దూప, దీప నైవేద్యాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే తప్పెట గుళ్ల, కోలాటం, నేల డ్యాన్స్‌లు అలరించాయి. రాత్రికి పలు సాస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సర్పంచ్ మామిడి శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు మామిడి లక్ష్మీ, నాయకులు కుచ్చర్లపాటి రామకృష్ణరాజు, రొంగలి శ్రీను, కొరుపోలు గోవింద, మామిడి కొండాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలమ్మతల్లి పాదాల ప్రతిష్ఠాపన మహోత్సవం

సబ్బవరం: మలునాయుడుపాలెం గ్రామంలో పోలమ్మతల్లి అమ్మవారి పాదాల ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. బోను దేముడమ్మ, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, నాయకులు గండి రవికుమార్, సర్పంచ్ బోను నాయుడు, యడ్ల నాయుడు, ఐడి బాబు, పి.దేముడు, భాను, నాగరాజు, దేముడు, అప్పలనాయుడు, బండియ్య, రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుమ్మపాల షుగర్స్‌ను ఆధునికీకరించాలి

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తుమ్మపాల షుగర్స్‌ను ఆధునీకరించి రైతులను ఆదుకోవాలని వీవీ రమణ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ కమిటీ కన్వీనర్ విల్లూరి పైడారావు కోరారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని గొప్పలు చెప్పిన ప్రజా ప్రతినిధులు ఇప్పుడు అమ్మకానికి పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. రైతు సంఘం నాయకుడు కర్రి అప్పారావు మాట్లాడుతూ ఫ్యాక్టరీని అమ్మాలని చూస్తున్న వ్యక్తినే ఈ ఫ్యాక్టరీకి ఎండీగా నియమించడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొర్లి మోదినాయుడు, పీలా సీతారామ్, కోరిబిల్లి శంకరరావు, కాళ్ల తేలయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

కశింకోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 8న జరగనున్న గౌరీపరమేశ్వరుల మహోత్సవాలను విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ ప్రతినిధులు వేగి గోపీకృష్ణ, వేగి వెంకట్రావు, కాండ్రేగుల సతీశ్, వేగి పాపారావు, పెంటకోట తాతారావు, వేగి దొరబాబు, ఆడారి నరసింగరావు, శిలపరశెట్టి మధు, వేగి సాయి తదితరులు కోరారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ శుక్రవారం అమ్మవారికి సారె ఊరేగింపు వైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. శనివారం ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన అనంతరం పురవీధుల్లో రథంపై ఊరేగింపు జరగనుందన్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేలవేషాలు, స్టేజీ ప్రోగ్రాంలు జరగనున్నాయని వారు చెప్పారు.

ఘనంగా ముగిసిన ఫార్మా ఎక్స్‌పో

- వేల సంఖ్యలో స్టాల్స్‌ను సందర్శించిన ఔత్సాహికులు



డ్రగ్ కంట్రోల్ ఏడీ విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న ఎంఏఎస్ఆర్ఎం ప్రతినిధులు

పరవాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీ మైదానంలో జేఎన్‌పీసీఎంఏ (జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ అసోసియేషన్) ఎంఏఎస్ఆర్ఎం (మ్యూచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్) సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న వైజాగ్ ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో-2025 బుధవారంతో ముగిసింది. ఎక్స్‌పో (ఎగ్జిబిషన్)లో ఉంచిన ఫార్మా, ఫార్మాయేతర ఉపకరణాల స్టాల్స్‌ను వేల సంఖ్యలో ఔత్సాహికులు సందర్శించారు. ఉపకరణాల పనితీరు, వాటి వినియోగం, ప్రత్యేకత తదితర అంశాలపై ఎగ్జిబిటర్లు అవగాహన కల్పించారు. ఇదిలా ఉండగా ఫార్మా అండ్ ల్యాబ్ ఎక్స్‌పో ముగింపు కార్యక్రమానికి డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి.అభిప్రియ, కె.కళ్యాణి, ఎన్.కళ్యాణి, ఎం.శ్రీనివాసరావు హాజరయ్యారు. ఎక్స్‌పో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను సందర్శించి హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని ప్రధాన నగరాల్లో మాత్రమే నిర్వహించే ఇటువంటి ఫార్మా ఎక్స్‌పోను ఇక్కడి ఫార్మా మైదానంలో నిర్వహించడం గొప్ప విషయమని డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఔత్సాహికులకు కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అనంతరం జేఎన్‌పీసీఎంఏ, ఎంఏఎస్ఆర్ఎం ఆధ్వర్యంలో డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్‌పీసీఎంఏ వైస్ చైర్మన్ ఎన్.సూర్యప్రకాశ్, ఎంఏఎస్ఆర్ఎం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.శివరాంప్రసాద్, జెట్టి సుబ్బారావు, ఫార్మా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన



పట్టణంలో నిరసన ప్రదర్శన చేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం నెహ్రూచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడారు. కార్మికులకు ఇప్పటి వరకు ఉన్న చట్టాలను అమలు చేయడం కోసం పోరాడుతూ ఉంటే, ఉన్న చట్టాలను కూడా రద్దు చేసి కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా పోరాటం చేయడంతో ఇప్పటి వరకు ఈ చట్టాలను అమలు చేయలేదని ఏప్రిల్ నుంచి అమలు చేయాలని చూస్తుందని ఆరోపించారు. ఈ చట్టాలు అమలైతే భవిష్యత్తులో కార్మికులకు ఎటువంటి హక్కులు అమలు కావని పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు, కోరిబిల్లి శంకరరావు, సీఐటీయూ నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

పరవాడ: కార్మికులకు నష్టదాయకమైన నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడ మండల పరిషత్ జంక్షన్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ లేబర్‌కోడ్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధులు ఎస్.వెంకటలక్ష్మి, ఎన్.పైడిలక్ష్మి, ఎం.ఉమా, టి.పరదేశమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలుచేయాలని వినతి



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జీవో ప్రకారం జిల్లా, ఏరియా, సామాజిక ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్యం, భద్రతా విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, కార్మిక చట్టాలను అమలు చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ కోరారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ శ్రీనివాస్‌ను బుధవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. కార్మికులకు కనీస వేతనాలు, చట్టాలు అమలు చేయాలని అలాగే కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సొమ్ము ఇవ్వకుండా నెలలు తరబడి జీతాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమను కాంట్రాక్టర్ దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కార్మికులకు బకాయిపడ్డ జీతాలు చెల్లించాలని, కార్మికుల భవిష్యత్తు పోరాటాలకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్, సంతోశ్, పోలారావు, నూకరాజు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిని కమ్మేసిన పొగమంచు



అనకాపల్లి రైల్వే స్టేషన్‌ను కమ్మేసిన పొగ మంచు

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అనకాపల్లి పట్టణాన్ని బుధవారం పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో వివిధ పనులపై వెళ్లేవారు, కూరగాయల వర్తకులు, రైతులు పొగమంచు కారణంగా రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. ప్రధాన రహదారులను పొగమంచు కప్పేయడంతో లైట్లు వేసుకొని వాహన చోదకులు రాకపోకలు సాగించారు. అలాగే రైల్వే స్టేషన్‌ను కూడా పొగమంచు కమ్మేసింది. రైళ్ల డ్రైవర్లు కూడా ఉదయం ఎనిమిది గంటల సమయంలో లైట్లు వేయాల్సి వచ్చింది. ఎనిమిదిన్నర గంటల వరకు పొగమంచు ఉంది. అనంతరం ఎండ కాయడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని సందర్శించిన ఐజీ ఠాకూర్

అనకాపల్లి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి రైల్వే స్టేషన్‌లోని ఆర్‌పీఎఫ్ కార్యాలయాన్ని బుధవారం ఆర్‌పీఎఫ్ ఐజీ ఆరోమాసింగ్ ఠాకూర్ సందర్శించారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించి అధికారులతో పలు అంశాలపై చర్చించారు. నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ మధు, ఎస్‌ఐ వసంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మనిధి సభ్యత్వం చేయించాలి

పరవాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హిందువులంతా ధర్మనిధి సభ్యత్వాన్ని విరివిగా చేయించాలని సమరసత సేవా ఫౌండేషన్ విశాఖ జిల్లా కన్వీనర్ ఎం.నరేంద్ర చౌదరి పిలుపునిచ్చారు. పరవాడ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం ధర్మనిధి సభ్యత్వ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనం నేటి తరానికి తెలియజేయాలని కోరారు. దేవాలయాలు కేంద్రంగా ప్రతీ రోజు భజనలు, సామూహిక హారతి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు డి.సంజీవరావు, డి.ఎరుకునాయుడు, పైలా శ్రీను, పి.కృష్ణవేణి, వి.అప్పలరాజు, ఎన్.అప్పలనాయుడు, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వి.అప్పలనాయుడు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన తప్పనిసరి

పరవాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని పరవాడ వైద్యురాలు జయశ్రీ కరిష్మా సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా వీవోఏలు, మండల సమాఖ్య ప్రతినిధులకు బుధవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. దూమపానం, మద్యం సేవించడం, పొగాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తాయన్నారు. అలాగే వచ్చే రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ గురించి వివరించారు. ఈ సదస్సులో వెలుగు ఏపీఎం బి.రంగారావు, సీహెచ్‌వో సాయిరాం, సీసీలు పాల్గొన్నారు.

చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలి

కశింకోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చిన్నారుల్లో పోషకాహార లోపం లేకుండా చూడాలని ఐసీడీఎస్ పీవో ప్రభావతి సూచించారు. తాళ్లపాలెం అంగన్‌వాడీ కేంద్రం-3ను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆమె మాట్లాడుతూ బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కిశోర బాలికలు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకొని వైద్య సలహాలు తీసుకోవాలని చెప్పారు. గర్భిణులు ఆకుకూరలు, ఐరన్ ఉన్న ఆహారం తీసుకునేలా అంగన్‌వాడీ కార్యకర్తలు సూచనలు చేయాలని చెప్పారు.

కోలుకున్న క్షతగాత్రులు

» కూటమి నాయకుల పరామర్శ



ఆస్పత్రిలో హెటెరో కెమిస్ట్‌లను పరామర్శిస్తున్న గెడ్డం బుజ్జి

నక్కపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హెటెరో ఔషధ పరిశ్రమలో మంగళవారం రాత్రి విషవాయువులు లీకై అస్వస్థతకు గురైన కెమిస్ట్‌లు కోలుకున్నారు. నక్కపల్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని బుధవారం ఉదయం కూటమి నాయకులు గెడ్డంబుజ్జి, కొప్పిశెట్టి వెంకటేశ్, వెలగా సుధాకర్, నల్లల రత్నాజీ తదితరులు పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు బాధితులను పరామర్శించారు. హెటెరోలో పనిచేస్తున్న ఉద్యోగులకు భద్రత లేదని, సరైన సేఫ్టీ విధానాన్ని హెటెరో యాజమాన్యం పాటించడం లేదని ఆయన ఆరోపించారు.

వాట్సాప్ ద్వారా ఇంటర్ హాల్‌టికెట్లు

» పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ పంపించే ఏర్పాట్లు

» హాజరు తక్కువైన విద్యార్థులకు ఫైన్ రద్దు

» సేవలను సులభతరం చేసిన ఇంటర్ బోర్డు

మద్దిలపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ ద్వారా పౌర సేవలను అందిస్తోన్న ప్రభుత్వం ఇంటర్ హాల్‌టికెట్‌లను కూడా అదే పద్ధతిలో పంపాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థి లేదా వారి తల్లిదండ్రుల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. హాల్‌టికెట్లు జనరేట్ కాగానే వారి వాట్సాప్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో ఫీజులు చెల్లించిన విద్యార్థుల ఫోన్ నంబర్లను జూనియర్ కళాశాలల యాజమాన్యాలు సేకరించి బోర్డుకు పంపిస్తున్నాయి. బైపీసీ, ఎంపీసీ విద్యార్థులకు ఈనెల పదో తేదీ నుంచి ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వాటికి హాజరయ్యే విద్యార్థుల వాట్సాప్‌కు హాల్‌టికెట్లను పంపించేందుకు ఇంటర్ బోర్డు ఏర్పాట్లు చేసింది. కాగా మార్చి 1 నుంచి ప్రారంభమయ్యే థియరీ పరీక్షల హాల్‌టికెట్లను ఈనెల 15వ తేదీ తరువాత వాట్సాప్‌కు పంపే అవకాశం ఉందని బోర్డు అధికారులు చెబుతున్నారు.

ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ...

75 శాతం హాజరు లేకుంటే జరిమానా చెల్లించాలనే నిబంధనను కూడా రద్దు చేశారు. పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా హాల్‌టికెట్లు జారీ చేయాలని ఈనెల నాలుగో తేదీన ఇంటర్ బోర్డుకు ప్రత్యేక ఆదేశాలు వచ్చాయి. ఫీజు బకాయిలు, హాజరు శాతం, ఫైన్లతో పని లేకుండా విద్యార్థి వాట్సాప్ నంబరు సేకరించి హాల్ టికెట్‌ను పంపే ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో 75 శాతం కంటే తక్కువ హాజరు కలిగిన విద్యార్థుల నుంచి వసూలుచేసిన ఫైన్‌ను కళాశాలల యాజమాన్యాలు చెల్లిస్తున్నాయి.

అధిక లోడ్ లారీలతో తరచూ ప్రమాదాలు

రెండు గ్రామాల సర్పంచులు, ప్రజల ఆందోళన

» రహదారిపై నిలిచిపోయిన 120 లారీలు



లారీలను అడ్డుకున్న రెండు గ్రామాల సర్పంచులు

మాకవరపాలెం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వస్తున్న లారీల వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని శెట్టిపాలెం, భీమబోయినపాలెం గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం తెల్లవారుజామున 4 గంటల నుంచి రెండు గ్రామాల సర్పంచులు అల్లు రామునాయుడు, నందకిశోర్ ఆధ్వర్యంలో రహదారిపై నిరసన తెలిపారు. దీంతో సుమారు 120 లారీలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా సర్పంచులు, గ్రామస్థులు మాట్లాడుతూ ఈ లారీల వల్ల నాలుగు నెలల్లో సుమారు 30 ప్రమాదాలు జరిగాయని వాపోయారు. శెట్టిపాలెం, భీమబోయినపాలెం, రామన్నపాలెం, జెడ్.గంగవరం, వెంకన్నపాలెం గ్రామాలకు చెందిన వారు అధికంగా చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యంతో పాటు పోలీసు, రోడ్డు రవాణా శాఖాధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కాగా, రెండు గ్రామాల ప్రజలు చేస్తున్న అందోళనకు టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, బీజేపీ ఓబీసీ కార్యదర్శి అడిగర్ల రాంబాబు, టీడీపీ నాయకులు జోగిపాత్రుడు, దుంగల రమణ మద్దతు పలికారు. ఆందోళన ఉధృతం కావడంతో సీఐ రేవతమ్మ, ఎస్‌ఐ దామోదర్‌నాయుడు వచ్చి సంప్రదింపులు చేశారు. అన్‌రాక్ యాజమాన్యం దిగివచ్చే వరకూ లారీలను విడిచిపెట్టమని ఆందోళనకారులు భీష్మించడంతో పోలీసులు తిరుగుముఖం పట్టారు. కాగా లారీ డ్రైవర్లు, క్లీనర్లకు సర్పంచులు మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తిచేయండి

» జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, పక్కన ఎస్పీ తుహిన్‌సిన్హా, డీఆర్‌వో సత్యనారాయణ



హాజరైన వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల ఏర్పాట్లపై ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి బుధవారం అధికారులతో సమీక్షించారు. 27న జరగనున్న ఎన్నికలకు 24 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. 27 బృందాలు, 24 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించి తగిన శిక్షణ ఇవ్వాలని, ఎక్కడా ఉల్లంఘనలు జరగకుండా చూడాలని సూచించారు. బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసి, కేంద్రాలకు ఎన్నికల సామగ్రి పంపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎన్నికల నియమావళి అమలు విషయంలో ఉల్లంఘనలు జరిగితే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో సత్యనారాయణ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లలిత కర్మాగారంలో కార్మికుల ఆందోళన

» కంటైనర్లు కదలకుండా బైఠాయింపు



కర్మాగారం ఆవరణలో బైఠాయించిన కార్మికులు

అచ్యుతాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని రాజరాజేశ్వరి లలితా త్రిపుర సుందరి ఫెర్రో అల్లాయిస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో కార్మికులు ఆందోళనకు దిగారు. గుట్టుచప్పుడు కాకుండా కర్మాగారంలోని ముడి సరకుతో పాటు ఉత్పత్తులను యాజమాన్యం తరలించటానికి తీసుకువచ్చిన కంటైనర్లను మంగళవారం రాత్రి అడ్డుకున్నారు. కంటైనర్లు బయటకు వెళ్లకుండా కర్మాగారం ఆవరణలోనే కాపలాగా ఉన్నారు. విషయం తెలుసుకున్న మిగతా కార్మికులు బుధవారం కర్మాగారం వద్దకు చేరుకోవడం పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. దీంతో కర్మాగారం జీఎం నాయుడు, ప్రొడక్షన్ ఇన్‌చార్జి సతీశ్‌రాజు వచ్చి కార్మికులతో సంప్రదింపులు జరిపారు. కర్మాగారం మూసివేయడం లేదని, ముడి సరకుతో పాటు ఉత్పత్తులను అడ్డుకోవద్దని కోరారు. బకాయిలతో పాటు నిబంధనల ప్రకారం మరో మూడు నెలల జీతం చెల్లించేవరకు ఇక్కడి నుంచి కదిలేది లేనది కార్మికులు తేల్చి చెప్పేశారు. ప్రస్తుతం కర్మాగారం లోపల కార్మికులు ఆందోళన కొనసాగిస్తున్నారు.

ఫిషింగ్ హార్బర్ నిర్మాణం సకాలంలో పూర్తిచేయాలి

కేంద్ర మంత్రికి ఎంపీ సీఎం రమేశ్ లేఖ



అనకాపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సాగరమాల ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన పూడిమడక ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులను సకాలంలో పూర్తిచేయాలని ఎంపీ సీఎం రమేశ్ కోరారు. గత ఏడాది డిసెంబరులో జరిగిన శీతాకాల పార్లమెంట్ సమావేశాలలో రూల్ 377 అంశం కింద ఎంపీ సీఎం రమేశ్ పూడిమడక వద్ద ఫిషింగ్ హార్బర్‌ను సకాలంలో పూర్తి చేయాలని లోక్ సభలో చర్చించిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్ మంత్రి సర్బానంద్ సోనోవాల్‌కు ఎంపీ రమేశ్ తాజాగా లేఖ రాశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పూడిమడక వద్ద మత్స్య ప్రాజెక్టు అభివృద్ధి చేస్తే ఆర్థిక అవకాశాలు పెరగడంతో పాటు ఆహార భద్రత, సామాజిక సాధికారతను పెంపొందించి తీర ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని లేఖలో పేర్కొన్నారు.

రైల్వే డివిజన్ కొనసాగింపు

... 5వ పేజీ తరువాయి

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొంత సానుకూలంగా స్పందించారు. పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. విశాఖలో జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసిన రెండో రోజే జనవరి 10వ తేదీనే ఈ ఫైల్‌కు రైల్వే బోర్డు ఆమోదం తెలిపేలా చేశారు. అయితే 'వాల్తేరు' పేరుకు బదులుగా 'విశాఖపట్నం' అని వ్యవహరిస్తామని పేర్కొన్నారు. జోన్ ప్రకటనకు ముందుగా కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు వాల్తేరు డివిజన్ నుంచి 680 కి.మీ. రైలు మార్గాలను తీసుకువెళ్లి రాయగడ డివిజన్‌లో కలిపేశారు. మిగిలిన 410 కి.మీ.తో విశాఖపట్నం డివిజన్ కొనసాగుతుందని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఇందులో ముఖ్యంగా సంతోషకరమైన విషయం ఏమిటంటే...ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లను కూడా తీసుకువచ్చి విశాఖ కేంద్రంగా నడిచే 'దక్షిణ కోస్తా జోన్'లో కలిపారు. దీనివల్ల దాదాపు రాష్ట్రం అంతటికీ ఒకే జోన్, దానికి విశాఖపట్నం కేంద్రంగా మారింది.

చేయాల్సినవి చాలా ఉన్నాయి

ఇల్లు అలకగానే సంబరం కాదన్నట్టుగా జోన్ కార్యాలయానికి శంకుస్థాపన చేసి, డివిజన్ పేరు మారిస్తే సరిపోదు. చేయాల్సినవి చాలా ఉన్నాయి. కార్యాలయానికి శంకుస్థాపన జరిగినా ఇప్పటి వరకూ ఒక్క పని మొదలు కాలేదు. ఆ నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించాల్సి ఉంది. అలాగే ప్రత్యేక అధికారిని నియమించి, ఇక్కడి వ్యవహారాలు చకచకా ముందుకు నడిపించాలి. జోన్ కేంద్రానికి ఏమేమి అవసరమో...అన్నీ ఒక్కొక్కటి త్వరగా వచ్చేలా చూడాలి. రాయగడ డివిజన్‌కు అవసరమైన సిబ్బందిని ఎలాగైతే ఇక్కడి నుంచి పంపించేస్తున్నారో...జోన్ కార్యాలయానికి అవసరమైన సిబ్బందిని కూడా రప్పించాలి. అప్పుడే మిగిలిన జోన్లతో దక్షిణ కోస్తా కూడా పోటీ పడుతుంది.

గోవాడలో క్రషింగ్‌కు మళ్లీ అంతరాయం

... 5వ పేజీ తరువాయి

దిగారు. ఎండీ బయటకు వచ్చి సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక సీఐ అప్పలరాజు, పోలీసులు ఫ్యాక్టరీకి చేరుకుని రైతులకు నచ్చచెప్పి, ఎండీతో మాట్లాడించారు. క్రషింగ్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టామని, యార్డులో టైరు బండ్లను, ట్రాక్టర్ల తొట్టెలను ఉంచి, పశువులను, ట్రాక్టర్ ఇంజన్లను తీసుకెళ్లిపోవాలని ఎండీ సూచించారు. దీంతో రైతులు వెనుతిరిగారు. కాగా బుధవారం రాత్రి 11.30 గంటల వరకు చెరకు క్రషింగ్ పునఃప్రారంభం కాలేదు.

అయ్యన్న వ్యాఖ్యలకు నిరసనగా 48 గంటల మన్యం బంద్

» 11, 12 తేదీల్లో నిర్వహణ.. అఖిలపక్షం పిలుపు

పాడేరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల మనుగడకు ఆయువుపట్టుగా ఉన్న 1/70 చట్టంపై అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేనందున ఈ నెల 11, 12 తేదీల్లో మన్యం బంద్‌కు నిర్ణయం తీసుకున్నామని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు తెలిపారు. బుధవారం స్థానిక బిస్మిల్లా కల్యాణ మండపంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల నాయకులు సమావేశమయ్యారు. బంద్‌లో గిరిజనులంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని అఖిలపక్ష నాయకులు కోరారు. అయ్యన్న వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో గిరిజనులు ఆందోళన పట్టాల్సి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, మాజీ ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, సీపీఐ నాయకులు కె.రాధాకృష్ణ, డీఎల్‌వో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మాణిక్యం, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జీవన్‌కుమార్, గిరిజన సంఘం నాయకులు పాలికి లక్కు, సీఐటీయూ నాయకులు ఎల్.సుందరరావు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో సినిమా షూటింగ్

» హీరోగా చోడవరం యువకుడు అఖిల్

» బిగ్‌బాస్ ఫేం భానుశ్రీ, అఖిల్ సన్నివేశాల చిత్రీకరణ





లక్ష్మీపురంలో హీరోహీరోయిన్లపై పాట చిత్రీకరణ... క్లాప్ కొడుతున్న నిర్మాత నట్టికుమార్

చోడవరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురంలో మంగళవారం రాత్రి సినిమా షూటింగ్ ప్రారంభమైంది. చోడవరం యువకుడు మారిశెట్టి అఖిల్ హీరోగా, బిగ్‌బాస్ ఫేం, నటి భానుశ్రీ హీరోయిన్‌గా ఏకే క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఈ సినిమాకు నిర్మాత నట్టికుమార్ క్లాప్ కొట్టారు. మంగళవారం రాత్రి హీరో, హీరోయిన్‌తో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన డ్యాన్సర్లతో పాటను చిత్రీకరించారు. నూతన దర్శకుడు శ్రీనిరన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు నిర్మాతగా మారిశెట్టి శ్రీకాంత్ వ్యవహరిస్తున్నారు. జడ్పీటీసీ సభ్యురాలు మారిశెట్టి విజయ శ్రీకాంత్ దంపతుల కుమారుడైన అఖిల్ హీరోగా పరిచయం చేస్తూ నిర్మిస్తున్న ఈ సినిమా విజయవంతం కావాలని నిర్మాత నట్టికుమార్ ఆకాంక్షించారు. కాగా, చోడవరం పరిసర ప్రాంతాల్లో పది రోజుల పాటు షూటింగ్ ఉంటుందని దర్శకుడు శ్రీనిరన్ తెలిపారు.

క్రైం... crime news

జలాశయంలో మరో బాలుడి మృతదేహం లభ్యం

ముంచంగిపుట్టు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోలాపుట్టు జలాశయంలో మరో బాలుడు మృతదేహం లభ్యమైంది. జలాశయంలో గత శనివారం నాటుపడవ మునిగి ఇద్దరు బాలురు గల్లంతైన విషయం తెలిసిందే. మంగళవారం ఒక బాలుడు మృతదేహాన్ని ఒడిశా ఓడీఆర్‌ఎఫ్ సహాయక బృందాలు వెలికితీసి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఓడీఆర్‌ఎఫ్ బృందాలు గాలింపులకు సిద్ధం అవుతుండగా జలాశయంలో శివ హంతాల్(15) మృతదేహం తేలాడుతూ కనిపించింది. దీంతో సహాయక బృందాలు జలాశయంలోకి వెళ్లి ఆ మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకువచ్చారు. బాలుడు మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు పార్వతి, సురేంద్రలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒడిశా రెడ్‌క్రాస్ సంస్థ శివ కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందించింది. జలాశయంలో గల్లంతైన ఇద్దరు బాలుర ఆచూకీ కోసం గత ఐదు రోజులుగా శ్రమించిన ఒడిశా ఓడీఆర్‌ఎఫ్ బృందాలకు, నందపూర్ అగ్నిమాపక సిబ్బందికి బాధిత కుటుంబ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ-క్రాప్ నమోదు వేగవంతం!

... 5వ పేజీ తరువాయి

రబీ సీజన్‌లో 41 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతున్నట్టు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా పెసర పంట 12 వేల ఎకరాల్లో, మినుము 8 వేల ఎకరాల్లో, నువ్వు రెండు వేల ఎకరాల్లో, వరి 1,500 ఎకరాల్లో సాగులో ఉండగా మిగిలిన పంటలు ఆరు వేల ఎకరాల్లో వున్నాయి. వ్యవసాయ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు 35,943 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యింది. మిగిలిన పొలాల్లో కూడా గడువులోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జాబితాలను మార్చి ఒకటి నుంచి 5వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శిస్తారు. 10వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి మార్చి 15న తుది జాబితాలను ప్రదర్శించనున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రావు తెలిపారు.

రంగురాళ్ల తవ్వకాలకు పావులు

... 5వ పేజీ తరువాయి

- నంబరు 1193లో నాలుగు ఎకరాల్లో రంగురాళ్ల తవ్వకాలకు ఈస్టర్న్ హట్స్ అండ్ ట్రైబ్స్ సంస్థ 2005, 2011 సంవత్సరాల్లో దరఖాస్తు చేసుకుంది.
- గొలుగొండ మండలం పప్పుశెట్టిపాలెం సర్వే నంబరు 55-56లో 21.89 ఎకరాల్లో రంగురాళ్ల తవ్వకాలకు పి.శ్రీనివాసరావు 2013లో దరఖాస్తు చేసుకున్నారు.
- పప్పుశెట్టిపాలెంలో సర్వే నంబరు 73లో 4.58 ఎకరాల్లో రంగురాళ్ల తవ్వకాలకు కె.కొండలరావు అనే వ్యక్తి 2008లో దరఖాస్తు చేసుకున్నారు.
- కరక రిజర్వ్ ఫారెస్టులో వేర్వేరుగా 12.4 ఎకరాలు, 3.15 ఎకరాల్లో రంగురాళ్ల తవ్వకాలకు ఆర్వీ రమణ 2011, 2014 సంవత్సరాల్లో రంగురాళ్ల తవ్వకాలకు దరఖాస్తు చేసుకున్నారు.
- కరక రిజర్వ్‌ఫారెస్టులో 20 ఎకరాల చొప్పున మొత్తం 60 ఎకరాల్లో రంగురాళ్ల తవ్వకాలకు పి.శశిప్రభ, చిటికెల వెంకటరమణ, పి.చిరంజీవిరాజు వేర్వేరుగా దరఖాస్తు పెట్టుకున్నారు.
- గొలుగొండ మండలం జమ్మవరం సర్వే నంబరు 1/1, 1/2 లో 3.93 ఎకరాల్లో రంగురాళ్ల తవ్వకాల కోసం టి.చిన్నారెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.

టూరిజం స్పాట్‌గా తాండవ

... 5వ పేజీ తరువాయి

తరువాత నర్సీపట్నం నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రూ.74 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రైతులు ఎవరైనా ఒకేచోట 50 ఎకరాలను ప్రభుత్వానికి లీజుకు ఇస్తే సౌర విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తుందని, ఏటా ఎకరాకు రూ.20 వేల చొప్పున ఇస్తుందని అయ్యన్న వెల్లడించారు. తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రాజెక్టు పరిధిలో 103 పనులకు రూ.13 కోట్లతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు మొదలు పెడతామని పేర్కొన్నారు. రూ.2 కోట్లతో చేపట్టిన అత్యవసర పనులు వేసవిలోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుని మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబు, కూటమి పార్టీల నాయకులు నందిపల్లి వెంకటరమణ, గొల్లు అచ్చియ్యనాయుడు, రాజాన సూర్యచంద్ర, కొండ్రు మరిడియ్య, అడిగర్ల నానిబాబు, ఎన్.విజయ్‌కుమార్, పారుపల్లి కొండబాబు, సింగంపల్లి సన్యాసిదేముడు, వెలగా వెంకట కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

జానకిరాంపురం సొసైటీలో భారీ అక్రమాలు

... 5వ పేజీ తరువాయి

బినామీ పేర్లతో రుణాలు మంజూరు చేసి నిధులు దారి మళ్లించారు. మరో వైపు రుణం తీసుకోకపోయినప్పటికీ తీసుకున్నట్టుగా రికార్డుల్లో నమోదు చేశారు. మొత్తం మీద రెండు కోట్లపైగా అక్రమాలు జరిగినట్టు గుర్తించిన సొసైటీ సభ్యులు కిల్లాడ సాంబమూర్తినాయుడు, గొల్లు నారాయణరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు, గొల్లు కల్పన, పి.శ్రీనివాసరావు తదితరులు ఏడాదిన్నర క్రితం డీసీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సొసైటీ జరిగిన అవకతవకలపై సెక్షన్ 51 కింద విచారణ జరిపాలని కోరారు. అయితే ప్రాథమిక విచారణల పేరుతో అధికారులు కాలయాపన చేస్తుండడంతో కలెక్టర్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అన్ని ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ స్పందించి జానకిరాంపురం సొసైటీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ రిజిస్ట్రార్ ప్రేమ స్వరూపరాణిని ఆదేశించారు. దీంతో ఆమె సహకార శాఖ అధికారులను విచారణకు నియమించారు. అయితే అక్రమార్కులు.. అధికార పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ద్వారా, సంబంధిత మంత్రితో చెప్పించి సెక్షన్ 51 కింద విచారణ జరగకుండా చేశారు. సహకార శాఖ అధికారులు సాధారణ విచారణ జరిపి చేతులు దులుపుకుంటున్నారు.

ఎన్నెన్నో అక్రమాలు

సొసైటీలో విచారణ జరిపిన అధికారులకు విస్తుపోయే అక్రమాలు బయటపడ్డాయి. బినామీలు, ఫోర్జరీ సంతకాలతో 200 మందికిపైగా రుణాలు మంజూరు చేసి రూ.కోటికి పైగా సొమ్మును పక్కదారి పట్టించారు. ఈ రుణాలకు ఏటా వడ్డీని జమ చేస్తూ, రుణాలను రీషెడ్యూల్‌చేస్తున్నారు. కాగా సొసైటీ నుంచి తీసుకున్న రుణాలను రైతులు సకాలంలో తిరిగి చెల్లించినప్పటికీ డీసీసీబీలో జమచేయకుండా సీఈఓ సొంత అవసరాలకు వాడుకున్నారు. కుసర్లపూడి గ్రామానికి చెందిన కిల్లాడ అప్పలసీతయ్యనాయుడు (తండ్రి జోగినాయుడు) పేరున రుణం తీసుకోకపోయినా ఆయన పేరు మీద 14-08-2014న రూ.62,223 రుణం తీసుకున్నట్టు రికార్డుల్లో చూపిస్తున్నారు. రుణం చెల్లించాలంటూ ఇటీవల నోటీసులు జారీ కావడంతో ఈ విషయం బయటపడింది. అలాగే 180 మంది సభ్యులకు చార్జి డిక్లరేషన్ లేకుండా నీకేసీసీ, ఎల్‌టీ రుణాలు ఇచ్చారు. 2008లో అప్పటి ప్రభుత్వం పంట రుణమాఫీ కింద పీఏసీఎస్‌లకు ఒక్కో రైతు తరపున రూ.5 వేలచొప్పున ఇన్‌సెంటివ్‌గా సహకార సంఘాలకు మంజూరు చేసింది. ఈ సొమ్మును ఆయా రైతుల ఖాతాలకు జమ చేయకుండా రూ.5 లక్షలపైగా నిధులను సీఈఓ, అప్పటి పాలకవర్గం సభ్యులు కలిసి పక్కదారి పట్టించారు. రుణాలు తీసుకోకపోయినప్పటికీ సుమారు 200 మంది రైతులకు ఎనిమిది నెలల క్రితం జప్తు నోటీసులు జారీ చేశారు.

51 సెక్షన్ కింద విచారణ

-కె.జగన్నాథం, సీనియర్ ఇన్‌స్పెక్టర్, సహకార శాఖ

జానకిరాంపురం సొసైటీలో అక్రమాలు జరిగినట్టు అందిన ఫిర్యాదులపై 51 సెక్షన్ కింద సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో సొసైటీలో పూర్తి స్థాయిలో విచారణ చేపడతాం. మంగళవారం నర్సీపట్నం డీసీసీబీలో జరిగిన ఘటనపై (పెట్రోల్ క్యాన్లతో బ్యాంకులో వెళ్లడం) సీఈఓ రామకృష్ణ, ఆఫీసు అసిస్టెంట్ దేముడులను విధుల నుంచి తొలగించాం.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	470
విజయనగరం	474
శ్రీకాకుళం	474